



# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవీ

Subscribe

www.prajaveekshanam.in | సంపుటి:16 | సంచిక :264 | 18 మంగళవారం ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari


## బీహార్ ఆలయ తొక్కిసలాట ఘటన



● తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,ఆగస్ట్17( ప్రజా వీక్షణం ):**

బిహార్ లఖిసరాయ్‌లోని అశోక్ ధామ్ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతికి గురయ్యారు. తొక్కిస లాటలో ఏడుగురు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన బాధితులు త్వరగా కోలుకో వాలని ఆకాంక్షించారు. ...మిగతా 2 లో...

## ఎన్‌టిఎ తప్పులకు విద్యార్థుల మూల్యం



● సోషియాలజీ, ఇంగ్లీష్ పరీక్షల రద్దు దారుణం

● మండిపడ్డ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,ఆగస్ట్17( ప్రజా వీక్షణం ):**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీరుపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోమారు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీసీ- నెట్ పరీక్షలో సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ పరీక్షలను రద్దు చేసి సెప్టెం బర్‌లో మళ్లీ నిర్వహించాలని ఎన్‌టీఏ నిర్ణయించడంపై రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు.

## పరిశ్రమలతో విద్యార్థుల కనెక్ట్ చేసే యత్నం



● జాబ్ పోర్టల్ ప్రారంభించిన మంత్రి వివేక్

**మెదక్,ఆగస్ట్17( ప్రజా వీక్షణం ):**

దేశంలోనే మొదటిసారిగా పరిశ్ర మలను విద్యార్థులను జాబ్ పోర్టల్ కనెక్ట్ చేస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ...మిగతా 2 లో...



## ప్రజల్లో గందరగోళం రేపిన 22ఎ జాబితా

● డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా

● సీలింగ్ చట్టం ఎత్తేశాక మళ్లీ ఎందుకొచ్చింది

● సిఎం రేవంత్ ఇల్లు జాబితాలో వచ్చాకనే చురుకు

● పాలనపై పట్టు లేదనడానికి ఇదే పెద్ద నిదర్శనం

● మీడియా సమావేశంలో ప్రభుత్వ తీరుపై హరీష్ ఆగ్రహం

**హైదరాబాద్,ఆగస్ట్17( ప్రజా వీక్షణం ):**

రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గంద రగోళానికి, అయోమయానికి గురిచే స్తోందని.. బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ఎవరి భూమి 22ఎలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్ర వ్యాప్త ంగా లక్షలాది మంది ప్రజలు బిక్కు బిక్కు మంటూ బతుకుతున్నారని మాజీ హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ..

...మిగతా 2 లో...

## విద్యార్థులను కలవండి.. చర్చించండి

**న్యూఢిల్లీ,ఆగస్ట్17( ప్రజా వీక్షణం )**



జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను స్వయంగా కలిసి వారి సమస్యలను వినాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కోరారు. ఈ మేరకు ఆగస్టు 14న సోరెన్‌కు రాహుల్ గాంధీ లేఖ రాశారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీక్, నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిందంటూ విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. రాంచీలో కొనసాగుతున్న ఈ నిరసనలు సోమవారం నాటికి 24వ రోజుకు చేరుకున్నాయి. విద్యార్థుల ఆందోళన ఇప్పటివరకు శాంతియుతంగానే సాగుతోందని, వారి డిమాండ్లు న్యాయమైనవని రాహుల్ గాంధీ తన లేఖలో పేర్కొన్నారు .గత కొన్ని నెలలుగా దేశవ్యాప్తంగా ప్రశ్న పత్రాలలీకులు, విద్యా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది . జార్ఖండ్ లోని పరిస్థితి మరింత తీవ్రతరం కాకుండా చూడటానికి ముఖ్యమంత్రి స్వ యంగా విద్యార్థులను కలిసి వారి ఆందోళనలను వినాలి. సమస్యలను చర్చల ద్వారా పరిష్క రించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి' అని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు.

# 'దిమాగీ నక్సల్ పార్టీ'...

## ఒక్క రోజులోనే 1.6 లక్షల ఫాలోవర్లు!

● 'దిమాగీ నక్సల్ పార్టీ' పేరుతో కొత్త ఇన్‌స్టాగ్రామ్ ఖాతా

● 24 గంటల్లోనే 1.6 లక్షలకు పైగా ఫాలోవర్లు

● ఖాతాలో ప్రస్తుతం 62 పోస్టులు

● ఖాతాను ఎవరు నిర్వహిస్తున్నారో లేని స్పష్టత

● ఈ నెలలోనే ప్రారంభమైన అకౌంట్






ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించిన 'దిమాగీ నక్సల్' పదం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఇదే పేరుతో ఓ కొత్త ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వెలుగులోకి వచ్చింది. ఖాతా ప్రారంభించిన 24 గంటల్లోనే 1.6 లక్షలకు పైగా ఫాలోవర్లు చేరడం ఆసక్తికరంగా మారింది.'దిమాగీ నక్సల్ పార్టీ' పేరుతో ఉన్న ఈ ఖాతాలో 62 పోస్టులు ఉన్నాయి. దాదాపు 35 ఖాతాలను ఫాలో అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లోని వివరాల ప్రకారం ఈ నెలలోనే ఖాతా తెరిచారు. ఇప్పటివరకు ఒకసారి యూజర్ నేమ్‌ను మార్చినట్లు సమాచారం ఉంది. అయితే ఈ ఖాతాను ఎవరు నిర్వహిస్తున్నారనే వివరాలు మాత్రం వెల్లడికాలేదు. ...మిగతా 2 లో...

## 22ఎ భూములపై ఆందోళన వద్దు

● అధికారుల తప్పిదం వల్లనే ఇలా జరిగింది

● అందుకు ప్రజలను క్షమాపణలు కోరుతున్నాం

● నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం

● టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి

● ప్రజలను ఆఫీసులకు తిప్పే అధికారులపై చర్యలు తీసుకుంటాం

● మీడియా సమావేశంలో రెవెన్యూమంత్రి పొంగులేటి వివరణ

**హైదరాబాద్,ఆగస్ట్17( ప్రజా వీక్షణం ):**



ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడుతూ. .అధికారుల పొరపాటు వల్ల ఇలా జరిగిందన్నారు. 22ఏ భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దని పొంగులేటి అన్నారు.

## ఇక మండల స్థాయి లోనే ప్రజావాణి ఫిర్యాదులు

● గోవిందరావుపేటలో ప్రారంభించిన సీతక్క

**ములుగు,ఆగస్ట్17( ప్రజా వీక్షణం ):**



ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరిం చేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని గోవిందరావు పేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మంత్రి సీతక్క సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. గతంలో ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతి సోమవారం ములుగు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి మండల కేంద్రంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ...మిగతా 2 లో...

# తెలంగాణలో సర్ జాబితా విడుదల




● 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు స్వీకరణ

● 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తింపు

● సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు

● ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల స్వీకరణ

● అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల

**హైదరాబాద్,ఆగస్ట్17( ప్రజా వీక్షణం ):**

తెలంగాణలో రాష్ట్ర ఎన్నికల సంఘం సర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. సర్ ప్రక్రియలో మొదటి భాగం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందినట్లు తెలిపారు. 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తించినట్లు సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. మరోవైపు సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ...మిగతా 2 లో...

## ఇక మండలస్థాయిలోనే ప్రజావాణి ఫిర్యాదులు

మొదటిపేజీ తరువాయి

ఇకపై గోవిందరావుపేట మండల ప్రజలు సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానిక అధికారులకు దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను స్వీకరించి, పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని మంత్రి సీతక్క సూచించారు. ఎమ్మార్వో సృజన్‌కుమార్, ఎంపీడీవో వరుణ్‌కుమార్‌లు ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సృజన్‌కుమార్, ఎంపీడీవో వరుణ్‌కుమార్, వ్యవసాయ అధికారి జితేందర్, మండల విద్యాధికారి దివాకర్, మార్కెట్ చైర్మన్ కళ్యాణి, గ్రంథాలయ చైర్మన్ రవిచందర్, గోవిందరావుపేట మండల సహకార సంఘం చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, పస్రా సర్పంచ్ సుమలతతో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణలో సర్ జాబితా విడుదల

మొదటిపేజీ తరువాయి

అలాగే 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించు కోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న వారు వీలైనంత త్వరగా స్పందించాలని కోరారు. ఏ కారణంతో నోటీసు జారీ చేశామో స్పష్టంగా తెలియజేస్తామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నవారు తమ అభ్యంతరాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పాల్గొంటారని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఎవరి ఓట్లు అయినా లేకపోతే ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ముసాయిదా జాబితాను ఎన్నికల అధికారులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

## పరిశ్రమలతో విద్యార్థుల కనెక్ట్ చేసే యత్నం

మొదటిపేజీ తరువాయి

సోమవారం జిల్లాలోని మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని పారిశ్రామిక ప్రాంతంలో జాబ్ పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో వెయ్యి పరిశ్రమలు ఉన్నాయని.. స్కిల్డ్ మ్యాన్ పవర్ అవసరం ఉందని అన్నారు. జిల్లా యంత్రాంగం, పరిశ్రమల యజమానులు కలిసి చేస్తున్న మంచి ప్రయత్నం ఇది అని చెప్పుకొచ్చారు. ఈ ప్రాంతంలో, దేశంలో నిరుద్యోగం పెద్ద సమస్యగా మారిందన్నారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. స్థానిక పరిశ్రమలకు కూడా ఉద్యోగులను, స్కిల్డ్ లేబర్‌ను అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థులు కేవలం సాఫ్ట్‌వేర్ పైనే దృష్టి సారించకుండా... ఇంకా చాలా రంగాల్లో కూడా మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. సింగరేణి ప్రాంతం మందమర్రిలో జర్మన్ నేర్పిస్తున్నామని.. వారిలో బీ2 లెవల్ వచ్చిందన్నారు. వారి కోసం రూ.25 లక్షల జీతం ఎదురుచూస్తోందని తెలిపారు. వీసా ఖర్చులను కూడా సగం వరకూ ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. విదేశాలకు వెళ్తే ఎన్నో కుటుంబాలు బాగుపడతాయని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

## చల్లగా చూడు నాగన్న..

### -మంథనిలో వైభవంగా నాగుల పంచమి వేడుకలు

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , ఆగస్టు 17:**

మంథనిలో శ్రావణ మాస శుక్ల పక్ష పంచమి సందర్భంగా నాగుల పంచమి వేడుకలను భక్తులు సోమవారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంథని పట్టణం బోయినిపేటలోని శ్రీ నాగులమ్మ ఆలయం తో పాటు పెంజేరుకట్టలోని నాగుల సంధిలోగల శ్రీనాగమయ్య పుట్ట వద్దకు మహిళలు తెల్లవారుజామునే తలస్నానాలు చేసి పూజా సామాగ్రితో పుట్టల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి చల్లగా చూడు నాగన్న అని వేడుకున్నారు. నాగేంద్ర స్వామి పుట్టలో పాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ శ్రేయస్సు, ఆరోగ్య ప్రదాత అయిన నాగదేవతను ఆరాధిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మంథని మండలంలోని గాజులపల్లిలోని శ్రీ సంతాన నాగేంద్రస్వామి ఆలయంలో పూలు, పండ్లతో భక్తులు పూజలు నిర్వహించారు. మంథని ప్రాంతంలో నాగుల పంచమి కన్నా ఎక్కువగా దీపావళి తర్వాత వచ్చే నాగుల చవితి పండుగను చాలా వైభవంగా నిర్వహిస్తారు. వేరే గ్రామాల నుండి వచ్చి స్థిరపడిన వారు, కోడల్లుగా వచ్చిన వారు మాత్రమే ఈ నాగుల పంచమి కి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకుంటారు. ఈసారి మాత్రం నాగేంద్ర స్వామి ఆలయాలు, పుట్టల వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకోవడం విశేషం.




## 22ఎ భూములపై ఆందోళన వద్దు

మొదటిపేజీ తరువాయి

22ఎ వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. దీన్ని బూచిగా చూపి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో సత్వర కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005- 994788కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 511 అప్లికేషన్లు, రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయి. ప్రైవేటు భూమిని 22-ఎ కింద పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ 22-ఎ జాబితాలోకి ఎందుకు వచ్చాయనే అంశంపై చర్చించాం. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం'.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్స్ ఇస్తే చాలని మంత్రి వివరించారు. న్యాయబద్ధమైన మీ ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ అభిస్తుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం. నిజమైన కేసులు త్వరలోనే పరిష్కారం అవుతాయని అన్నారు.

## కళ్యాణలక్ష్మిని అటకెక్కించే యత్నం

మొదటిపేజీ తరువాయి

**నిజామాబాద్,ఆగస్ట్17( ప్రజా వీక్షణం ):**

బకల్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు అనేక అనుమానాలకు తావిస్తోందని హైకోర్టు నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేక పోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్‌పై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి మొదలైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాసంక్షేమం తిరిగి గాడిన పడాలంటే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. ఎన్నికల వేళ మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని, పింఛన్లను రూ.2000 నుంచి రూ.4 వేలకు పెంచుతామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్, కల్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేకపోయిందని మండిపడ్డారు. వ్యవసాయంపై ఆధారపడిన గిరిజనులు, సాధారణ రైతులకు రేవంత్ సర్కార్ తీరని అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. రూ.2లక్షల రుణమాఫీ సగం మంది రైతులకు కూడా అందలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరంతరాయంగా అందిన రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని చెప్పి ఉన్న రూ. 10వేలను కూడా సక్రమంగా ఇవ్వకుండా ఎగ్గొట్టి రైతులను ఆగం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు ప్రతిరోజూ గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఫోన్ చేయగానే పొలాల వద్దకే ఎరువులు చేరే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో యాప్‌ల పేరుతో రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. యూరియా, ఎరువుల కోసం అన్నదాతలు రోడ్లపై నిలబడాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన నిర్వహణ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో లగచర్లలో లంబాడాల భూములను కాపాడేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ నాయకులతో

## గొల్లగూడెంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం

### -హర్షం వ్యక్తం చేసిన స్థానిక ప్రజలు

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , ఆగస్టు 17:**

మంథని మున్సిపాలిటీ 6వవార్డు పరిధిలోని గొల్లగూడెం ప్రాంత ప్రజలు డ్రైనేజీ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం మున్సిపాలిటీ పాలకవర్గం దృష్టికి రావడంతో, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా డి ఎం ఎఫ్ టి నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయించి గొల్లగూడెం ప్రాంతంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు.మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యములో స్థానిక కౌన్సిలర్ పోతరబోయిన శ్రీలత డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంబోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రజల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించేందుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్ యేల్లంకి వంశీధర్, నాయకులు పోతరబోయిన క్రాంతి కుమార్, లైశెట్టి రాజు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## 'దిమాగీ నక్సల్ పార్టీ'...

మొదటిపేజీ తరువాయి

ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ 'దిమాగీ నక్సల్' అనే పదాన్ని ఉపయోగించారు. మావోయిస్టులపై పోరులో సాధించిన విజయాలను ప్రస్తావించిన ఆయన.. అడవుల్లో సాయుధ నక్సలిజాన్ని అణిచివేయగలిగామని చెప్పారు. అయితే సాయుధ నక్సల్స్ తగ్గిపోయినా.. 'దిమాగీ నక్సల్స్' ఇంకా ఉన్నారని వ్యాఖ్యానించారు.మోదీ చేసిన ఈ వ్యాఖ్యల తర్వాత అదే పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వెలుగులోకి రావడం ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తి రేపుతోంది. అయితే ఖాతా వెనుక ఎవరున్నారు? దాని ఉద్దేశం ఏంటి? అనే విషయాలు మాత్రం స్పష్టంగా తెలియలేదు.

## బీహార్ ఆలయ తొక్కిసలాట ఘటన

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు చేశారు. బిహార్‌లోని లఖిసరాయ్‌లో జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసింది. ఈ దుఃఖ సమయంలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. బాధితులకు స్థానిక యంత్రాంగం సహాయం అందిస్తోంది' అని ప్రధాని మోదీ అన్నారు. మరోవైపు, బాధితులకు బిహార్ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్రమాదం గురించిన వివరాలను లఖిసరాయ్ జిల్లా మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ వెల్లడించారు. శ్రావణ మాసం సందర్భంగా జలాభిషేకం చేసేందుకు వేలాది మంది భక్తులు అశోక్ ధామ్ ఆలయానికి చేరుకున్నట్లు తెలిపారు. దర్శనం కోసం మహిళలు, పురుషులు రెండు క్యూ లైన్లలో నిలబడి ఉండగా.. పురుషుల క్యూ లైన్‌కు సమీపంలో విద్యుత్ స్తంభం అకస్మాత్తుగా కూలిపోయిందన్నారు. స్తంభానికి ఉన్నది కేబుల్ వైర్ అయినప్పటికీ.. విద్యుత్ వైర్ అనే పుకారు క్షణాల్లో వ్యాపించిందని పేర్కొన్నారు. దీంతో తొక్కిసలాట జరిగిందని తెలిపారు. రెండు నిమిషాల వ్యవధిలో ఏడుగురు మృతి చెందగా.. దాదాపు 12 మందికి పైగా గాయపడినట్లు జిల్లా మేజిస్ట్రేట్ పేర్కొన్నారు. బాధితులను వెంటనే చికిత్స నిమిత్తం సదర్ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. మృతులు, గాయపడిన వారి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

## ఎన్‌టిఎ తప్పులకు విద్యార్థుల మూల్యం

మొదటిపేజీ తరువాయి

ఎన్‌టీఏ తప్పులకు వేలాది మంది విద్యార్థులు మూల్యం చెల్లించాల్సి వస్తోందని విమర్శించారు. ఎక్స్ వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ.. 'మోదీజీ.. మీ ఎన్‌టీఏ ఏం చేసిందో చూడండి. జూన్ 22 నుంచి 30 వరకు సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ యూజీసీ-నెట్ పరీక్షలు జరిగాయి. దాదాపు రెండు నెలల తర్వాత ప్రశ్నపత్రాల్లో లోపాలు, గత ప్రశ్నల పునరావృతం కారణంగా ఈ మూడు పరీక్షలను ఎన్‌టీఏ రద్దు చేసింది. ఎన్‌టీఏ నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి పరీక్షకు సిద్ధమైన వేలాది మంది అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడం, ఫీజులు చెల్లించడం, దూర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు ప్రయాణించాల్సి వస్తోంది. తప్పు చేసింది ఎన్‌టీఏ.. కానీ, శిక్ష అనుభవించేది మాత్రం విద్యార్థులా?' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షా వ్యవస్థ విద్యార్థులను దోపిడీ చేసే వ్యవస్థగా మారిందని రాహుల్ ఆరోపించారు. దేశంలో సరైన పరీక్షా వ్యవస్థ లేదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లలో ఇదే విషయాన్ని ప్రస్తావించానన్నారు. 'ఇది విద్యా వ్యవస్థ కాదు.. డబ్బు, కాలం, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని తీసుకుని చివరికి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని వ్యవస్థగా మారింది' అని రాహుల్ విమర్శలు గుప్పించారు. యూజీసీ-నెట్ ప్రశ్నపత్రాలు పరీక్షకు ముందే లీకయ్యాయా? అని రాహుల్ గాంధీ సందేహం వ్యక్తం చేశారు. ఈ ప్రశ్నకు ఎన్‌టీఏ ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారాయన. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మొదటి అడుగు మాత్రమేనన్న రాహుల్ గాంధీ.. ఎన్‌టీఏ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'సెప్టెంబర్‌లో మళ్లీ పరీక్ష రాయనున్న ప్రతి విద్యార్థికి చెబుతున్నా.. మీరు సమస్య కాదు. పరీక్షను నిర్వహించలేని వ్యవస్థను ప్రధాని మోదీ ప్రభుత్వం నిర్మించింది. ఆ వ్యవస్థ చేసిన తప్పులకు ఇప్పుడు విద్యా ర్థులనే బాధ్యులుగా చేస్తోంది. మీ విలువైన సంవత్సరాలు వృథా అవుతున్నాయి. దీనిపై మోదీ సమాధానం చెప్పే వరకు మేము ప్రశ్నిస్తూనే ఉంటాం' అని రాహుల్ గాంధీ అన్నారు.

### ప్రజల్లో గందరగోళం రేపిన

## 22ఎ జాబితా

మొదటిపేజీ తరువాయి

దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట్ కింద 22ఎలో పెట్టడం ఏ రకమైన న్యాయం..ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ఎలో పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ ఎ÷-లాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలని హరీశ్ రావు ప్రశ్నించారు. తమ ప్రాపర్టీ 22ంలో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ఎ లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఔక్షఅ వచ్చిన భూములకు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇప్పుడు అవే భూములను తీసుకొచ్చి 22ఎ లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ లాంటి ప్రాంతాలను సైతం ప్రొహిబిషన్ లో పెట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు హరీశ్ రావు. 22ఎ అనేది ఈ ప్రభుత్వానికి ప్రజలను అడ్డగోలుగా దోచుకునే ఒక ఆయుధంగా మారిందన్నారు. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా, 22ం నుంచి భూమిని బయటకు తీయాలన్నా 30 శాతం కమిషన్ ఇవ్వాలనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. 30 శాతం కమిషన్ లేనిదే రెవెన్యూ శాఖలో ఒక్క ÷ల్ కూడా కదలడం లేదు. చివరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఎ ప్రొహిబిషన్ లిస్ట్‌లో ఉందంటే ఆశ్చర్యం కలుగుతోంది. తన సొంత ఇంటికి సెగ తగిలే సరికి ప్రభుత్వంలో హడావిడి మొదలైందన్నారు హరీశ్ రావు. మీకు చురుకు తగిలితేనే కానీ సామాన్యుల బాధలు పట్టవా.. ? స్వయంగా ముఖ్యమంత్రి పరిస్థితే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి..? వాళ్ల గోడు ఎవరు వినాలి. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది ఈ ప్రభుత్వ తీరని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ముందు అడ్డగోలుగా భూములను 22ఎలో వేయడం, ఆ తర్వాత దాన్ని సరిచేయడానికి జీవోలు తెస్తాం, రివ్యూలు చేస్తాం అని డ్రామాలు ఆడటం ఎందుకు.. తప్పు జరిగినప్పుడు తక్షణమే ఆ భూములను 22ం నుంచి తొలగించాలి కానీ..

ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS

18 మంగళవారం ఆగస్టు 2026

3

www.prajaveekshanam.in

# సంపాదకీయం

## సోలార్ పవర్‌లో స్వయం సమృద్ధి సాధించాలి !

దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలని, విదేశాలపై ఆధారపడడం మానుకోవాలని ప్రధాని మోడీ ఎర్రకోట్ నుంచి ఇచ్చిన సందేశం ఆలోచింపచేసేదిగా ఉంది. అయితే దేశాన్ని స్వయం సమృద్ధిగా నిలపాల్సిన బాధ్యత పాలకులదే. ముఖ్యంగా ఇంధన, ఆహార రంగాల్లో మనం మరింత బలం కావాల్సి ఉంది. 140 కోట్ల జనాభా కలిగిన భారత్ తన ఇంధన అసవరాల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడు తోంది. 88.5 శాతం ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోంది. సహజవాయువు, పెట్రోలియం ఇలా అన్నింటికి గల్ఫ్, రష్యా, అమెరికా వంటి దేశాలే దిక్కు. అంతర్జాతీయ పరిణామాలకు భారత ఇంధన భద్రత ఒడిదొడు కులకు లోనవుతోంది. ఇటీవల హార్ముజ్ జలసంధి, ఇరాన్ అమెరికా యుద్ధం వల్ల భారత్ లో ఎల్పీజీ కొరత ఏర్పడింది. ఎక్కువ దిగుమతుల వల్ల విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. ఒక్క యుద్ధం వస్తే ఎంతగా ఒడిదుడుకులకు లోనవుతాం. అందువల్ల సహజ వనరులను అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. విదేశాల నుంచి అదేపనిగా అవసరం ఉన్నా లేకున్నా దిగుమతలును చేసుకోవడం వల్ల దేశీయంగా ధరలు పరుగులు పెడుతున్నాయి. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి. ముఖ్యంగా ఉప్పులు, పప్పులు, నూనెలపై ఆంక్షలు విధించుకోవాలి. దేశీయంగా ఆహార ఉత్పత్తులను పెంచుకోవాలి. సేంద్రియ వ్యవసాయం తప్పనిసరి చేయాలి. ఇకపోతే గ్యాస్, పెట్ర తదితర ఉత్పత్తులపైనా అన్వేషణ సాగాలి. మన సముద్ర భాగాల్లోనే గ్యాస్ లేదా పెట్రోలియం నిల్వలు వెలుగులోకి వస్తే భారతదేశానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రధాని మోడీ కూడా సముద్ర మథనం గురించి చెప్పారు. ఆగస్టు 15 స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగిస్తూ.. సముద్ర మంథన్ ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. భారత జలాల్లో సముద్ర అడుగు భాగాల్లో ఇంధన వనరుల కోసం అన్వేషన కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్ని వెల్లడించారు. భారత్ తన ఇంధన అవసరాల్లో మెజారిటీ దిగుమతులపై ఆధారపడు తోంది. అయితే, గతంలో భారత్‌లో ఆఫ్‌షోర్ అన్వేషణకు సంబంధించిన ప్రాంతాల్లో దాదాపు 99 శాతం ప్రాంతాన్ని గతంలో 'నో-గో' జోన్‌లుగా ప్రకటించినట్లు, ఇప్పుడు వాటిలో చాలా ప్రాంతాలను అన్వేషణ కోసం తెరిచినట్లు ఆయన వెల్లడించారు. దీనివల్ల గ్యాస్, పెట్రోలియం వంటి ఇంధనాన్ని గుర్తించే పక్రియ మరింత వేగవంతం కానుంది. భారత్ ఇంధన నిల్వల్ని అన్వేషించేందుకు 'సముద్ర మంథన్' అనే నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప÷-లోరేషన్ స్కీమ్ ప్రకటించింది. భారతదేశ సముద్ర తీర ప్రాంతాల్లోని బేసిన్లలో చమురు, సహజ వాయువు నిల్వలను గుర్తించి భవిష్యత్తులో ఉత్పత్తి పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. 2026 జూలై 31న కేంద్ర మంత్రివర్గం ఈ పథకానికి 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు రూ.84,084 కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో సముద్ర అడుగుభాగంలోని భౌగోళిక నిర్మాణాలను గుర్తించేందుకు సిస్మిక్ సర్వేలు, డీప్ సీ, అల్ట్రా డీప్ వాటర్ డ్రిల్లింగ్,సైంటిఫిక్ డ్రిల్లింగ్, సాధారణ ఆఫ్‌షోర్ మౌలిక వసతులు, చమురు-గ్యాస్ తయారీ వంటివి ఉంటాయి. ఈ పథకం ద్వారా 600 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా ఆయిల్ ఈక్వివలెంట్ హైడ్రోకార్బన్ నిల్వలు దేశానికి సమకూర్చవచ్చని, దేశీయ ఉత్పత్తి పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ ప్రకారం భారత్‌కు తొమ్మిది ఆఫ్‌షోర్ బేసిన్లు ఉన్నాయి. ఇవి మొత్తం సుమారు 17.3 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం నో-గో ఏరియా ప్రాంతాలను 13.67 లక్షల చదరపు కిలోమీటర్ల నుంచి 24,832 చదరపు కిలోమీటర్లకు తగ్గించారు. దీని ద్వారా భారత్‌కు చెందిన 23.6 లక్షల చదరపు కిలోమీటర్ల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్(ఇఇజి)లో సుమారు 99 శాతం ప్రాంతం అన్వేషణకు అందుబాటులోకి వచ్చింది. ఈ ఏరియాల్లో అన్వేషణ పెరుగుతుంది. అన్వేషణ పెరిగినంత మాత్రాన ఖచ్చితంగా గ్యాస్, పెట్రోలియం ఉంటుదని హామీ ఇవ్వదు. డీప్-సీ ఎక్స్‌ప్లోరేషన్ చాలా ఖరీదైనది, సాంకేతికంగా క్లిష్టమైనది, ఫలితాలు అనిశ్చితంగా ఉండే పక్రియ. అందుకే మెరుగైన భౌగోళిక డేటా, మరిన్ని డ్రిల్లింగ్ కార్యకలాపాలు, కొత్త మౌలిక వసతుల ద్వారా అన్వేషణ నుంచి ఉత్పత్తి దశకు చేరే అవకాశాలను 'సముద్ర మథన్' పెంచే ప్రయత్నం చేస్తోంది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే భారత ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గుతుంది. అదే సమయంలో బయో ఇంధనాలపైనా ప్రయత్నాలు సాగాలి. పరిశోధనలు చేపట్టాల్సి ఉంది. సోలార్ పవర్ పరిశోధనలు విస్తృతం కావాలి. దీనిలో విజయం సాధిస్తే ఇంధన కొరతను అధిగమించవచ్చు. ఈ దిశగా పరిశోధనలు పెరగాలి. సోలార్ పవర్‌ను చౌకగా ఉత్పత్తి చేసుకునే దశకు చేరుకోవాలి. అప్పుడే మనకు భవిష్యత్ సులువు కాగలదు. అతిగా విదేవాలపై ఆధారపడాల్సిన ఆగత్యం పోతుంది. దీంతో ఇంధన అవసరాలతో పాటు, విద్యుత్ సంక్షోభం కూడా తొలగనుంది.

## నార్లపాటి దుర్గారావును పరామర్శించిన ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు





-- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన శ్రేయోభిలాషులు

-- శాసనసభ్యులు చిర్రి బాలరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు

టి.నరసాపురం, ఆగస్టు 17:(ప్రజా వీక్షణం)

ఇటీవల ప్రమాదవశాత్తు తలకు తీవ్ర గాయమై, విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో అత్యవసర వైద్య చికిత్స పొంది, ప్రస్తుతం బంధం చర్ల రోడ్డులోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న టి.నరసాపురం మండల ఎం.ఆర్.పి.ఎస్ సీనియర్ నాయకులు నార్లపాటి దుర్గారావును పలువురు నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నాయకులు, ఆయన త్వరగా కోలుకుని తిరిగి ప్రజా సేవలో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో టి.నరసాపురం మండలంలోని సామాజిక కార్యకర్తలు మరియు దళిత సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గారావుకు ధైర్యాన్ని అందించారు.ఈ క్లిష్ట సమయంలో సకాలంలో స్పందించి, అత్యవసర వైద్య చికిత్స కోసం అన్ని విధాలుగా అండగా నిలిచి, ప్రత్యేక చొరవ చూపిన పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజుకు పరామర్శించిన నాయకులు, కార్యకర్తలు తమ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి ఆయన ఆరోగ్యంపై ఎమ్మెల్యే చూపుతున్న శ్రద్ధను ప్రత్యేకంగా అభినందించారు.

## ఆలయంలో కొనసాగుతున్న అఖండ భజన..

దేవరకద్ర. ఆగస్టు 17 ప్రజా విక్షణం

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా అఖండ దీపారాధన, మరియు భజన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రావణమాసంలో ప్రతి సంవత్సరం స్వామివారి ఆలయంలో 41 రోజులపాటు అఖండ దీపారాధన పెట్టడం అనావాతిగా వస్తున్నది అని అర్చకులు తెలిపారు. దీపారాధన భజన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగానే శ్రావణమాసం 5వ రోజు సోమవారం ఆలయంలో శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు అలంకరణ వంటి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించి . ఆలయంలో అఖండ దీపారాధన వెలిగించరు.భజన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ దేవస్థానం ఈవో శివానంద చారి, అర్చకులు నాగరాజు, నాగభూషణ్ , భజన బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## నందిగామలో జర్నలిస్టుల నిరసన, వినతిపత్ర సమర్పణ

### జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి..: తహసిల్దార్‌కు నందిగామ పాత్రికేయుల విజ్ఞప్తి

నందిగామ, ఆగస్టు 17 (ప్రజా వీక్షణం):

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ప్లాటినం జూబిలీ ఉత్సవాల ప్రారంభం సందర్భంగా నందిగామ పట్టణ జర్నలిస్టులు గురువారం స్థానిక తహసిల్దార్ సురేష్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, ఆరోగ్య కార్డుల అమలులో ఎదురవుతున్న సమస్యలను తొలగించాలని వినతిపత్రంలో ప్రధానంగా కోరారు. అలాగే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, సీనియర్ పాత్రికేయ పింఛన్ పథకాన్ని అమలు చేయాలని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు మరియు బెదిరింపులను అరికట్టేందుకు ప్రత్యేక భద్రతా చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.సమాజానికి వెన్నెముకగా నిలుస్తూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన తహసిల్దార్ సురేష్ బాబు స్పందిస్తూ, జర్నలిస్టుల సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నందిగామ పట్టణ జర్నలిస్టులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న దుర్గా ప్రసాద్‌కు వడ్డీ రఘురాం ఆర్థిక సాయం

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజా వీక్షణం)

పెంటపాడు మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన దాకే దుర్గాప్రసాద్ ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు సోమవారం దుర్గాప్రసాద్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని వడ్డీ రఘురామ్ నాయుడు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ధనుంజయరావుకు జీవిత సాఫల్య పురస్కారం

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కట్టుపల్లి ధనుంజయరావు ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. వ్యవసాయ, ఉద్యాన రంగాల అభివృద్ధితో పాటు విద్యా, పరిశోధనా రంగాల్లో, రైతు సంక్షేమానికి ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ వేము సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. తాడేపల్లిగూడెం పట్టణంలో నిర్వహించిన సంస్థ రజతోత్సవ వేడుకల్లో ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్, వర్సిటీ ఉపకులపతి ధనుంజయరావును శాలువాతో ఘనంగా సత్కరించి పురస్కార పత్రాన్ని అందజేశారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్న దనుంజయరావుని విశ్వ విద్యాలయ అధికారులు, బోధనా, బోధనేతర సిబ్బంది అభినందించారు. ఈ పురస్కారం ఆయన వ్యక్తిగత ప్రతిభకు మాత్రమే కాకుండా డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి కూడా గర్వకారణమని వారు హర్షం వ్యక్తం చేశారు.



## బిజెపిరాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన దేవన్న సాగర్..

దేవరకద్ర ఆగస్టు 17 ప్రజావిక్షణం

బిజెపి రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యునిగా దేవరకద్ర గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు దేవన్న సాగర్ సోమవారము హైదరాబాదులో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు బిజెపి రాష్ట్ర ఓబిసి అధ్యక్షులు ఆనంద గౌడ్ దేవన్నకు నియమక పత్రాన్ని అందించారు. తదుపరి రాష్ట్ర అధ్యక్షునికి ఘనంగా శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతి కుమార్, రవీందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

## ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

### శుద్ధ జల ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

బాపట్ల : ఆగస్టు 17 ( ప్రజా వీక్షణం )

ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన తాగునీటిని అందించడమే లక్ష్యమని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు.బాపట్ల రూరల్ మండలం, నందిరాజు తోటలో లుక్క శ్రీనివాసరావు, నాగలక్ష్మి గార్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నాగలక్ష్మి' శుద్ధ జల ప్లాంట్‌ను సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన తాగునీటిని అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదని నిర్వాహకులకు సూచించారు. నాణ్యతా ప్రమాణాలను నిరంతరం పాటిస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సేవా దృక్పథంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.శుద్ధమైన తాగునీరు ప్రజల ఆరోగ్యానికి ఎంతో కీలకమని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నాణ్యమైన సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 'నాగలక్ష్మి' శుద్ధ జల ప్లాంట్ నిర్వాహకులు మంచి సేవలందిస్తూ మరింత అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తాత జయప్రకాష్ నారాయణ, కందుల బాల కోటేశ్వరరావు, పరిశా గోపి, జంపని చలమయ్య, బలగాని శ్రీను, అనగాని బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ పాఠశాలకి సీలింగ్ ఫ్యాన్ అందజేసిన రజని

బాపట్ల : ఆగస్టు 17 ( ప్రజా వీక్షణం )

సోమవారం బాపట్ల మండలంలోని స్టువార్టు పురంలో ఉన్న అంగన్వాడీ పాఠశాలలో సమాజ సేవకురాలు బండ్రెడ్డి రజని టీచర్ రిక్వెస్ట్ మేరకు వారి పాఠశాలలో పిల్లల కోసం వారికి సీలింగ్ ఫ్యాన్ అందచేశారు.అలాగే అక్కడ వర్క్ చేస్తున్న ఆయమ్మ కు చీర అందచేసి పిల్లలందరికి స్నాక్స్ అందచేశారు.అలాగే పిల్లల తల్లులతో కొంత సమయం కేటాయించి వారి ఆరోగ్య జాగ్రత్త లు మరియు చదువు ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈకార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్ పద్మావతి,పిల్లలు,తల్లులు,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## సోలార్ ప్లాంట్ నిర్మాణం పనులు నిలుపుదల చేయండి..

### ప్రజావాణిలో ఫిర్యాదు..

దేవరకద్ర ఆగస్టు 17 ప్రజా విక్షణం

దేవరకద్ర మండల కేంద్రంలో గ్రామానికి చెందిన కృష్ణాచారి తండ్రి కళ్యాణ చారి కి సంబంధించిన సర్వేనెంబర్ 525 భూమిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న సోలార్ ప్లాంటును నిర్మాణం పనులను వెంటనే నిలుపుదల చేయాలని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు కృష్ణాచారి కుమారుడు ప్రాణేశు చారి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ భూమి కోర్టులో కేసు ఉన్నా కూడా ఈ సర్వే నెంబర్ భూమిపై ఇటీవల రాష్ట్రప్రభుత్వం మహిళా సంఘాలకు ఇంద్ర మహిళా శక్తి సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఎమ్మెల్యే ద్వారా శంకుస్థాపన చేయించారు. భూమి పూజ చేసిన విషయమై ఇటీవల జిల్లా కలెక్టర్ కు ఆర్డీవోకు మరియు దేవాలయ అసిస్టెంట్ కమిషనర్ కు తాసిల్దార్ సబ్ రిజిస్టర్ కు రెవెన్యూ కోర్టులో ఈ భూమిపై కేసులు ఉన్నా విషయం పై ఫిర్యాదు చేసినా కూడా మా భూమిలో సోలార్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేసిన విషయం గురించి హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు జడ్జి శ్రవణ్ కుమార్ ఉత్తర్వులు మేరకు ఐ. ఏ నెంబర్2/2026ఇన్ సి ఆర్ పి నెంబర్2053/2026 హైకోర్టు ఉత్తర్వులు స్టేటస్ –కో ఉత్తరులను జారీ చేయడం జరిగింది. హైకోర్టు ఉత్తర్వుల కాపీలను జిల్లా కలెక్టర్ కు మా భూమిలో ఎలాంటి మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు నిర్మాణాలు చేపట్టకుండా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఆర్ డి ఓ పిడి, ఆర్డీవో, దేవ దయ అసిస్టెంట్ కమిషనర్ మరియు తాసిల్దార్ కు హైకోర్టు ఇచ్చిన స్టేటస్–కొ ఆర్డర్ కాపీని వెంటనే అమలు అయ్యే విధంగా తీసుకోవాలని అలాగే మాకు న్యాయం చేయాలని ఆయన కోరారు. దీనిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. మొత్తం ప్రజావాణికి 7 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు, ఈ ప్రజావాణి కార్యక్రమంలో తాహ సిల్దార్ మహమ్మద్ హర్షద్, మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# కన్యకా పరమేశ్వరి ఆలయంలో వార్షికోత్సవ పూజా ప్రారంభం..





దేవరకద్ర ఆగస్టు 17 ప్రజా వీక్షణం

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో తొమ్మిదవ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో అర్చకులు ప్రత్యేకంగా అమ్మవారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో పూలతో అలంకరణ చేశారు. తదుపరి మహిళలు కుంకుమార్చన కార్యక్రమాలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా అర్చకులు వేద మంత్రాలతో గరుడ స్తంభానికి ప్రాణప్రతిష్ట పూజలు చేశారు. అలాగే హోమాలు. గోమాతకు ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆలయకమిటీ అధ్యక్షులు కమిటీ సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి.. షాదీ ముబారక్.. రద్దుకు రేవంత్ రెడ్డి కుట్ర..







### దేవరకద్ర లో బి ఆర్ఎస్ ధర్నా..

దేవరకద్ర ఆగస్టు 17 ప్రజా వీక్షణం

గత ప్రభుత్వము ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి.. షాదీ ముబారక్.. పథకాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రద్దు చేయడానికి కుట్ర చేస్తున్నారని మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు.బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపు మేరకు సోమవారం దేవరకద్ర మున్సిపాలిటీ మండల కేంద్రం లో మండల బిఆర్ఎస్ పార్టీ శాఖ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.కళ్యాణ లక్ష్మీ – షాదీ ముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమం పై కోర్టు లో స్టే విధించిన నేపథ్యంలో పేద కుటుంబాల హక్కుల కోసం దేవరకద్ర మున్సిపాలిటీ మండల కేంద్రం లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యం లో శాంతి యుతంగా ధర్నా కార్యక్రమం నిర్వహించి ర్యాలీ గా ఏమ్మార్వో కార్యాలయం వరకు వెళ్లి మండల తహసీల్దార్ మమ్మద్ హర్షద్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది.దేవరకద్ర మున్సిపాలిటీ మాజీ మార్కెట్ చేర్మెన్ జెట్టి నర్సిం హారెడ్డి బిఆర్ఎస్ పార్టీ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ పేదింటి ఆడబిడ్డ పెళ్ళికి అండగా కళ్యాణ లక్ష్మి ద్వారా లక్ష రూపాయలు అందజేస్తే. ఈ దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి –షాదీ ముబారక్ పథకాలను అడ్డుకోవాలని చూస్తుంది అని ఆయన తెలిపారు. ఎన్నికల సమయం లో తులం బంగారం అదనంగా ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు పథకం పూర్తిగా ఎత్తేయాలని చూస్తుంది. అని ఆయన అన్నారు.కళ్యాణ లక్ష్మీ – షాదీ ముబారక్ పథకాలు కచ్చితంగా కొనసాగించాలి. లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదు అని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీకాంత్ యాదవ్, కొండా రెడ్డి, వెంకట రాములు, ఆంజనేయులు, నారాయణరెడ్డి, బాలరాజు, చలమారెడ్డి, రాధాకృష్ణ, ఆంజనేయు లు, సుదర్శన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, కొండల్, భార్గవ్, శ్రీనివాసులు, అడ్డు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందరికీ హోమియో వైద్య సేవలపై అవగాహన అవసరం

- డాక్టర్ దాసరి చంద్రశేఖర్

పర్చూరు ( బాపట్ల ) : ఆగస్టు 17

( ప్రజా వీక్షణం )



సోమవారం ఉదయం ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యాధికారి మరియు బాపట్ల జిల్లా ఆటిజం సెంటర్ ఆయుష్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ ఉప్పుటూరు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులకు మరియు రోగులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల నందు అన్ని రకాల దీర్ఘకాలిక మరియు తరుణ వ్యాధులకు అత్యుత్తమమైన ప్రభుత్వ హోమియో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, వీటిలో ముఖ్యంగా షుగర్, బీపీ, థైరాయిడ్, ఊబకాయం వంటి అన్ని రకాల జీవనశైలి సమస్యలు, అలాగే చిన్న పిల్లల్లో ఎదుగుదల లోపాలు, బుద్ధిమాంద్యం, అతిగా ప్రవర్తించడం (ఏ డి హెచ్ డి), ఆటిజం (ఏ ఎస్ డి), మట్టి, బలపం, బియ్యం తినడం, మాటలు, నడక, పళ్ళు ఆలస్యంగా రావటం, నిద్రలో పక్క తడపటం, మతిమరుపు, పాలు పడక పోవటం, అజీర్తి, వాంతులు, విరోచనాలు, మలబద్దకం, మొలలు, ఆస్తమా, నిమ్ము, జలుబు, జ్వరం, ఎలర్జీలు, ఎడినాయిడ్స్, టాన్సిల్స్ వంటి వివిధ రకాల చిన్నపిల్లల వ్యాధులకు, మెదడు మరియు నరాల సంబంధిత వ్యాధులైన పార్కిన్సోనిజం,ఫిట్స్, ఆల్జీమర్స్,మైగ్రేన్ తలనొప్పి, చెవి ముక్కు గొంతు సమస్యలకు,కళ్ళకలక,కంట్లో శుక్లాలు, ఉబ్బసం ,నెమ్ము, సి ఓ పి డి,ఎంఫైసీమ వంటి ఊపిరితిత్తుల సమస్యలు, గుండె కండ పెరగడం,గుండె కవాటాల సమస్యలు, గ్యాస్ట్రైటిస్,జి ఈ ఆర్ డి, గ్యాస్ట్రిక్ అల్సర్,ఇరిటేబుల్ బోవెల్ సిండ్రోమ్, పైల్స్,ఫిషర్స్, ఫిస్టులా వంటి జీర్ణ వ్యవస్థ సమస్యలకు మరియు స్త్రీ పురుషుల్లో వచ్చే అన్ని రకాల లైంగిక మరియు గర్భధారణ సమస్యలకు ,ఆస్టియో ఆర్థరైటిస్,రుమటాయిడ్ ఆర్థరైటిస్,గౌట్,సర్వైకల్ స్పాండిలోసిస్ ,లాంబార్ స్పాండైలోసిస్ ,ఫ్రోజెన్ షోల్డర్, లాంబార్ డిస్క్ ప్రొలాప్స్ వంటి అన్ని రకాల కీళ్ల సమస్యలకు, కామెర్లు,గాల్బ్లాడర్ స్టోన్స్, కిడ్నీలో రాళ్లు,యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్, చర్మవ్యాధులైన సోరియాసిస్, ఎగ్జిమా, తామర, బొల్లి మచ్చలతో పాటు ఎక్కడా తగ్గని మొండి వ్యాధులకు అత్యుత్తమైన ప్రభుత్వ హోమియో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రస్తుతం ఉప్పుటూరులో రోజుకు కనీసం 30 మంది రోగులు వివిధ ప్రాంతాల నుండి వస్తున్నారని,మేము ముందు వచ్చామంటే మేము ముందు వచ్చాము అని గొడవలు పడుతున్నారని, హోమియోపతి వైద్య విధానంలో చక్కని వైద్య సేవ అందించాలంటే రోగితో వైద్యుడు కనీసం ఒక అరగంటైనా మాట్లాడి కేసు టేకింగ్ అనే విధానం ద్వారా రోగి యొక్క పుట్టుపూర్వోత్తరాలను పూర్తిగా పరిశీలించాలని,అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం అందించడం సాధ్యమవుతుందని,పెరిగిన రోగుల రద్దీ మరియు వసతుల లేమి కారణంగా రోగి యొక్క సంపూర్ణ సమాచారాన్ని సేకరించలేక పోతున్నానని, కావున మెరుగైన వైద్య సేవలు పొందాలంటే,రోగులందరూ ఓపికతో వేచి ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యశాలకు వచ్చిన రోగులు, స్వచ్ఛంద సేవకురాలు కే. నాగరాజా,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక
GENERAL NEWS
18 మంగళవారం ఆగస్టు 2026
5
www.prajaveekshanam.in

# పేకాట స్థావరంపై ఎస్ఐ జయబాబు మెరుపు దాడి...

## 12 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్!

## "ఆటలు మానేయండి అంటే వినకుండా తమాషాలు అనుకుని బరితెగిస్తే తాట తీస్తాం!" --- ఎస్.ఐ. జయబాబు హెచ్చరిక






**టి. నరసాపురం, ఆగస్టు 17 (ప్రజా వీక్షణం):**

"నేను ఉన్న ఏరియాలో జూదం ఆడితే ఊరుకునే ప్రసక్తే లేదు" అని ఏలూరు జిల్లా టి. నరసాపురం మండలం పుట్రేపు గ్రామంలో ఎస్ఐ జయబాబు మరోసారి తన సత్తా చాటారు. పేకాట స్థావరంపై అందిన పక్కా సమాచారంతో పోలీసులు మెరుపు దాడి చేసి, గుంపుగా కూర్చుని జూదం ఆడుతున్న 12 మంది పేకాట రాయుళ్లను ఊహించని రీతిలో అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల మాస్టర్ ప్లాన్.. చిక్కిన నిందితులు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఎస్ఐ జయబాబు నేతృత్వంలో పోలీసులు వేసిన మాస్టర్ ప్లాన్ ఫలించడంతో, నిందితులకు తేరుకునే సమయం కూడా దొరకలేదు. ఈ ఆకస్మిక తనిఖీల్లో నిందితుల వద్ద నుంచి రూ. 57,140 నగదుతో పాటు పేకముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన అందరిపై ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్యాంబ్లింగ్ యాక్ట్ కింద పక్కా సెక్షన్లతో కేసులు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమే: ఎస్ఐ జయబాబు హెచ్చరిక ఈ సందర్భంగా ఎస్ఐ జయబాబు మాట్లాడుతూ జూదగాళ్లను తీవ్రంగా హెచ్చరించారు. కఠిన చర్యలు తప్పవు: "చట్టానికి ఎవరూ అతీతులు కాదు! పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించేది లేదు. తప్పు చేస్తే చట్టం ముందు ముఖం చాటేయలేరు.. కఠినంగా శిక్షిస్తాం!" అని స్పష్టం చేశారు. బరితెగిస్తే తాట తీస్తాం: "ఆటలు మానేయండి అని ఎన్నిసార్లు చెప్పినా వినకుండా, దీన్ని ఏదో తమాషాగా తీసుకుని బరితెగిస్తే తాట తీస్తాం!" అంటూ జయబాబు హెచ్చరించారు. కుటుంబాల సంక్షేమమే ధ్యేయం: గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని, గ్రామాల పవిత్రత ను దెబ్బతీసే జూద క్రీడలను సమూలంగా రూపుమాపే వరకు ఇలాంటి దాడులు ఆగవని ఆయన తేల్చిచెప్పారు. జూద క్రీడల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, యువత పెడదోవ పట్టకుండా ఉండేందుకే ఇలాంటి కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జయబాబు అభిప్రాయ పడ్డారు .అలాగే ఈ ఘటనతో స్థానిక ప్రాంతం లోని పేకాట రాయుళ్ల వెన్నులో వణుకు పుట్టిందని, పోలీసులు చేపట్టిన ఈ చర్యపై స్థానిక ప్రజలు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పేదవాడి ఆపద్బాంధవుడు అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్

## డయాలసిస్ బాధితునికి ఆర్థిక సాయం అందజేత!

**బాపట్ల : ఆగస్టు 17 ( ప్రజా వీక్షణం )**

సమాజంలో ఎక్కడ ఏ నిరుపేద కుటుంబం అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా, ఆర్థిక స్థోమత లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సతమతమవుతున్నా వారికి అండగా నిలవడమే పరమావధిగా అఖండ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న 'అఖండ ఫౌండేషన్' మరోసారి తన గొప్ప మనసును చాటుకుంది. ఆపదలో ఉన్న ఒక నిరుపేద డయాలసిస్ బాధితునికి ఆర్థిక సాయం అందించి, అతనికి పునర్జన్మపై భరోసా కల్పించారు. బాపట్ల కర్లపాలెం మండలం ఎంవీ రాజుపాలెం గ్రామానికి చెందిన శీలం సుబ్బారెడ్డి గత కొంతకాలంగా తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. బతకాలంటే క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకోవాల్సిన దుస్థితి. అయితే పూట గడవడమే కష్టమైన అత్యంత నిరుపేద కుటుంబం కావడంతో, రోజురోజుకూ పెరుగుతున్న వైద్య ఖర్చులను భరించలేక ఆయన కుటుంబం తీవ్ర నైరాశ్యంలోకి వెళ్లిపోయింది. చేతిలో చిల్లిగవ్వ లేక, వైద్యం చేయించుకునేందుకు మార్గం కనబడక సుబ్బారెడ్డి పడుతున్న యాతన వర్ణనాతీతం.ఈ దీనస్థితి గురించి తెలుసుకున్న అఖండ ఫౌండేషన్ సభ్యులు ఆట్ల హరిబాబు రెడ్డి వెంటనే చొరవ తీసుకున్నారు. బాధితుని దుస్థితిని ఫౌండేషన్ అధ్యక్షుల దృష్టికి తీసుకువెళ్లి, ఎలాగైనా ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. స్పందించిన అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ తక్షణమే తగిన సహాయం అందజేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.సోమవారం నాడు అఖండ ఫౌండేషన్ ప్రతినిధి ఆట్ల హరిబాబు రెడ్డి స్వయంగా బాధితుని నివాసం వద్దకు వెళ్లి, ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ తక్షణ సాయం సుబ్బారెడ్డి రాబోయే వైద్య ఖర్చులకు ఎంతో ఊరటనిస్తుందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ మాట్లాడుతూ.. "కష్టాల్లో ఉన్న తోటి మనిషికి చేయూతనివ్వాలనే ఏకైక మానవతా దృక్పథంతోనే మేము ఈ ఫౌండేషన్‌ను స్థాపించాము.ప్రతి పేదవాడి మొహంలో చిరునవ్వు చూడటమే మా సంస్థ ప్రధాన లక్ష్యం. డబ్బులు లేక వైద్యం అందక ఏ ఒక్క పేదవాడూ ప్రాణాలు కోల్పోకూడదనే ఉద్దేశంతోనే మా వంతు ప్రయత్నం చేస్తున్నాం.మా దృష్టికి వచ్చిన నిరుపేద రోగులకు, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ మా ఫౌండేషన్ శక్తిమేర ఆర్థిక సాయం అందించేందుకు అన్ని వేళలా ముందుంటుంది" అని భరోసానిచ్చారు.నిరుపేదలకు ఆపద్బాంధవుడిగా మారుతున్న అఖండ ఫౌండేషన్ సేవలను స్థానిక ప్రజలు,హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు.



# ప్రజావాణికి 7 దరఖాస్తులు..







**దేవరకద్ర,ఆగష్టు 17 ప్రజా విక్షణం**

దేవరకద్ర మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 7 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు .వివిధ సమస్యలపై ప్రజలు ప్రజావాణి లో తమ ఫిర్యాదులను అధికారులకు సమర్పించారు. ఇందు లో రెవెన్యూ శాఖకు సంబంధించి 4 దరఖాస్తులు, పంచాయతీరాజ్ శాఖకు 2 దరఖాస్తులు, పోలీస్ శాఖకు సంబంధించి 1 దరఖాస్తు వచ్చినట్లు ఎంపీడీవో వెల్లడించారు.ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు . ప్రజలు తమ సమస్యలను ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో శ్రీనివాస రావు సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో తాహ సిల్దార్ మమ్మద్ హర్షద్, మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

# నాగరాజా మమ్ములను కాపాడవయ్యా..

## ఘనంగా నాగుల పంచమి వేడుకలు..

**దేవరకద్ర ఆగస్టు 17 ప్రజా వీక్షణం**

నాగరాజా మమ్ములను కాపాడవయ్యా అంటూ ప్రజలు మహిళలు భక్తిశ్రద్ధలతో శ్రావణమాసంలో మొదటి సోమవారం సందర్భంగా నాగుల పంచమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పిల్లలు కొత్త బట్టలు ధరించి ఇంటి వద్ద పూజలు చేసుకుని తదుపరి శివాలయం వద్ద ఉన్న నాగదేవత విగ్రహాలకు మహిళలు భక్తితో పూజలు చేసి పాలు పోసి నైవిద్యాలు సమర్పించారు. అలాగే కొత్తయినా పెళ్లి జంటలు కూడా నాగదేవత విగ్రహానికి భక్తితో పూజా కార్యక్రమాలు చేసి పాలు పోశారు. తదుపరి నేవిద్యాలు సమర్పించారు. అలాగే కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద, ఉన్న నాగ దేవత విగ్రహాలకు మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకుని పాలు పోశారు. అక్కడ దేవాలయం వద్ద భక్తులు బారులు నిలబడ్డారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు దేవస్థానం ఈవో శివానంద చారి, అన్ని విధాల చర్యలు తీసుకున్నారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.



# భూగర్భ జలాల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలి






## ఇంకుడుగుంటల నిర్మాణాన్ని విస్తృతం చేయాలి

## చీరాల ఆర్డీఓకి జనతా వారధి ద్వారా వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు

**చీరాల : ఆగస్టు 17 ( ప్రజా వీక్షణం )**

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు క్రమంగా పడిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని జనతా వారధి ద్వారా బీజేపీ నాయకులు సోమవారం చీరాల ఆర్ డి ఓ నరసింహారావు కి వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసేందుకు గ్రామాలు, పట్టణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో ఇంకుడుగుంటలు, రీఛార్జ్ పిట్స్, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని కోరిన డాక్టర్ తాడివలస దేవరాజు ఈ సందర్భంగా గోలి మల్లికార్జునరావు ,మేడికొండ భరణి రావు మాట్లాడుతూ చెరువులు, కుంటలు, కాలువలు,సహజ నీటి ప్రవాహ మార్గాలను ఆక్రమణల నుంచి రక్షించడంతో పాటు పూడికతీత,పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు నీటి పొదుపు సాగు విధానాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలపై సమగ్ర సర్వే నిర్వహించి,అవసరమైన ప్రాంతాలను గుర్తించి ఇంకుడుగుంటలు నిర్మించాలని, ప్రభుత్వ భవనాల్లో రైన్‌వాటర్ హార్వెస్టింగ్‌ను తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు. భూగర్భ జలాల అధిక వినియోగంపై పర్యవేక్షణ పెంచి,ప్రజలు తెలియజేసే నీటి సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే పనుల పురోగతిని ప్రజలకు పారదర్శకంగా తెలియజేయాలని, ప్రజల భాగస్వామ్యంతో భూగర్భ జలాల పరిరక్షణకు శాశ్వత చర్యలు చేపట్టాలని జనతా వారధి విజ్ఞప్తి చేసింది."వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టుకుందాం -- భూగర్భ జలాలను కాపాడుకుందాం -- భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పిద్దాం." అని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, శంకర శెట్టి నాగేశ్వరరావు,మేడికొండ భరణి,డా.తాడివలస దేవరాజు, దామిశెట్టి గుప్తా, క్షత్రియ సుహాసిని ,లావణ్య పల్లెల,సయ్యద్ షబీరా, ఏల్చూరి మురళి,కాకుమాను సుబ్బరావు,చిప్పల శ్రీను,గోలి మల్లికార్జునరావు,జూలకంటి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

# దేవాలయంలో భక్తులకు అన్నదానం..

**దేవరకద్ర ఆగస్టు 17 ప్రజా విక్షణం**

మండల కేంద్రంలోని స్థానిక ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన పద్మమ్మ ఆమె కుమారులు సందీప్ కుమార్,శ్రావణ్ కుమార్, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి వారము ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అనావతిగా వస్తున్నది అని దీనిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శివ నంద చారి, ఆలయ అర్చకులు నాగరాజు, నాగభూషణం,సిబ్బంది వారు భక్తులు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

# బాపట్ల పట్టణంలో విగ్రహాల రగడ

## విగ్రహం పెట్టిన వ్యక్తినే మరచిన కూటమి పార్టీ నాయకులు

బాపట్ల : ఆగస్టు 17 ( ప్రజా వీక్షణం )

బాపట్ల చరిత్రలో నందమూరి తారక రామారావు విగ్రహాన్ని మొట్టమొదటి సారిగా ఎమ్మెల్సీ గా ఉన్నప్పుడు అన్నం సతీష్ ప్రభాకర్ సమయంలో బాపట్ల ప్రధాన రహదారిలో రెండు ప్రదేశాలలో ఏర్పాటు చేశారు. వైసీపీ సమయంలో రోడ్డు విస్తరణ పేరుతో అధికారులు తొలగించి మరల ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం కూటమి తెలుగు దేశ పార్టీ నాయకులు తీసిన విగ్రహాలు ఏర్పాటు చేస్తూ బాపట్ల ప్రధాన రహదారుల్లో పెడుతున్న నందమూరి తారక రామారావు విగ్రహం శిలాఫలకంలో అన్నం సతీష్ ప్రభాకర్ పేరును కనిపించకుండా చేయాలనే చెడు ఉద్దేశంతో నేడు ఆయన పేరును లేకుండా శిలాఫలకాలు ఏర్పాటు చేస్తున్నారు.లక్షల ఖర్చుపెట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన అన్నం సతీష్ పేరును లేకుండా చేయడంపై బాపట్ల ఎమ్మెల్యే పై అనేక విమర్శలు వినబడుతున్నాయి.కూటమి ప్రభుత్వంలో కూటమి నాయకుడికే అవమానం జరుగుతుంటే పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు బాపట్ల కూటమి నాయకులు.దీంట్లో ప్రధానంగా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య ధోరణితో ఇదంతా జరుగుతుందని అధికారులు కూడా ఇందులో పాత్ర ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.






# కౌకుంట్ల ఎంపీడీఓ కార్యాలయంలో తొలి ప్రజావాణి..

దేవరకద్ర ఆగస్టు 17 ప్రజా విక్షణం

ప్రభుత్వ ఉత్తర్వు నంబర్ 4 మేరకు కౌకుంట్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయంలో సోమవారం తొలి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. తహశీల్దార్ సుందర్ రాజ్, ఎంపీడీఓ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా మండలంలోని వివిధ సమస్యలపై రెవెన్యూ విభాగానికి ఒకటి, పంచాయతీ రాజ్ విభాగానికి ఒకటి చొప్పున మొత్తం రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహశీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ఉత్తమ ఉద్యోగిగా తహసిల్దార్ ఎస్ కె సలీమాకు అభినందనలు

బాపట్ల : ఆగస్టు 17 ( ప్రజా వీక్షణం )

పంద్రాగస్టు వేడుకల్లో ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రం, షీల్డ్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పి ఉమామహేశ్వర్ చేతుల మీదగా అందుకున్న తహసిల్దార్ సలీమాను సహచర శాఖల అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. వృత్తిపట్ల నిబద్ధతతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం దగ్గుబాటి సురేష్, మండల వ్యవసాయ అధికారి శారద, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ ఫణికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.




# పెంటపాడు గ్రామంలోని ఎస్సీ స్మశాన వాటిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలింగ లక్ష్మణ్‌రావు

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజా వీక్షణం)

పెంటపాడు మండలంలోని కస్పా పెంటపాడు గ్రామంలోని ఎస్సీ స్మశాన వాటిక (ఇందిరా కాలనీ) సమస్యలను వెంటనే పరిష్కరించాలని దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం ధర్నా నిర్వహించారు. స్మశాన వాటికకు సరైన దారి లేకపోవడం, మెరక చేయకపోవడం, ఆక్రమణలు ఉండటంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలింగ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ దళితులకు కేటాయించిన స్మశాన వాటికల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. స్మశాన వాటికకు వెంటనే దారి ఏర్పాటు చేసి, మెరక చేయించాలని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ తాడికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ స్మశాన వాటికలోని ఆక్రమణలను తొలగించి, చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ వై.రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని రెల్లి కులస్తుల స్మశాన వాటికకు కూడా కొలతలు వేసి, హద్దులు నిర్ధారించి వారికి అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గున్నపాటి మౌనిక, వారా ధనలక్ష్మి, ఎస్.కుమారి, డి.రమణ, డి.దుర్గా, డి.అన్నపూర్ణ, పి.జ్యోతి, డి.రూతమ్మ, బి.అనూష, బండి కుమారి, కళ్యాణ్, కోన రాజేష్, కోటి తదితరులు పాల్గొన్నారు.




# విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి:......

## ఏపీఈపీడీసీఎల్ సదస్సులో ఏఐటీయూసీ డిమాండ్

జంగారెడ్డిగూడెం ఆగస్టు 17(ప్రజా వీక్షణం)

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విద్యుత్ రంగంలో సేవలునందిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ యూనియన్ నాయకులు గట్టిగా డిమాండ్ చేశారు. కార్మికుల చిరకాల వాంఛ అయిన సంస్థలో విలీనం చేసుకోవడంతో పాటు ప్రత్యక్ష చెల్లింపుల విధానాన్ని అమలు చేయాలని కోరుతూ, ఆగస్టు 20వ తేదీన విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే ఆగస్టు 29, 2026 న తలపెట్టిన కార్యక్రమాలపై, కార్మికుల డిమాండ్లపై విస్తృతంగా చర్చించారు. కంపెనీలో విలీనం చేసి, మధ్యవర్తులు మరియు కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా కార్మికుల ఖాతాల్లో నేరుగా వేతనాలు జమ చేయాలని, క్షేత్రస్థాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రాణ నష్ట భయాలు, భద్రతా లోపాలు మరియు ఇతర సేవా సమస్యలను వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సదస్సు మరియు సమావేశంలో ఏలూరు జిల్లా ఏఐటీయుసి యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి సత్యనారాయణ, డివిజన్ ఉపాధ్యక్షులు మరియు నాయకులు ఎన్.నాగేంద్ర, రత్నాజీ బాబు, సుబ్రహ్మణ్యం, నాగరాజు, బ్రహ్మం, జగదీష్, రమేష్, కిరణ్, శరన్ తదితరులు పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు.




# జిల్లా స్థాయి పీ జీ ఆర్ ఎస్ లో ఉత్తమ జిల్లా అధికారిగా డీ ఎస్ ఓ జగన్ మోహన్ రావు

బాపట్ల : ఆగస్టు 17 ( ప్రజా వీక్షణం )

బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీ జీ ఆర్ ఎస్ ) కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (డీ ఎస్ ఓ ) శ్రీ ఏ. జగన్ మోహన్ రావును ఉత్తమ జిల్లా అధికారిగా జిల్లా కలెక్టర్ ప్రకటించారు.జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి దాదాపు 80 నుంచి 100 మంది జిల్లా స్థాయి అధికారులు హాజరవుతున్న నేపథ్యంలో,ప్రజల నుంచి వచ్చిన అర్జీలు,ఫిర్యాదుల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేస్తున్న అధికారులను గుర్తించి ప్రోత్సహించే క్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జగన్ మోహన్ రావుకు ఈ గుర్తింపు లభించింది.ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు,పౌర సరఫరాల శాఖకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నందుకు ఆయనను ఉత్తమ జిల్లా అధికారిగా ఎంపిక చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా డీ ఎస్ ఓ ఏ. జగన్ మోహన్ రావుకు అధికారులు,సిబ్బంది, హృదయపూర్వక అభినందనలు,శుభాకాంక్షలు తెలిపారు.



# హెచ్ పి వి పై వ్యాక్సినేషన్ డ్రైవ్..

దేవరకద్ర ఆగస్టు 17 ప్రజావి క్షణం

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వ్యాకల్ కాన్సర్ ) నివారణలో భాగంగా, సోమవారం దేవరకద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ )లో వైద్యాధికారులు ప్రత్యేక హెచ్‌పీవీ, వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. టీకా: హెచ్‌పీవీ వ్యాక్సిన్ (గర్భాశయ క్యాన్సర్ నివారణకు)అర్హులైన వయస్సు: 14 సంవత్సరాలు పూర్తయి, 15 ఏళ్లు నిండని బాలికలు.ముఖ్య గమనిక: 14 సంవత్సరాలు పూర్తయి, 15 సంవత్సరాలు నిండని బాలికలందరూ దేవరకద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్ ) వచ్చి హెచ్‌పీవీ - గర్భాశయ క్యాన్సర్ నివారణ) వ్యాక్సిన్ తీసుకోవాల్సిందిగా స్థానిక వైద్యాధికారి శరత్ చంద్ర కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

## బాధితుల అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి

## జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల : ఆగస్టు 17 ( ప్రజా వీక్షణం )

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలు పదే పదే పునరావృతం కాకుండా బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను విన్న ఎస్పీ,వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించి చట్టపరిధిలో నిర్దిష్ట గడువులోగా విచారించి పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను చట్టపరిధిలో సమగ్రంగా విచారించి,నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించి బాధితులకు తగిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.బాధితుల సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పీజీఆర్ఎస్ విభాగానికి పంపాలని ఆదేశించారు.ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.సుధాకర్,సీసీఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్ గారు,పీజీఆర్ఎస్ సెల్ సీఐ కే.శ్రీనివాసరావుతో పాటు ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మి.. షాదీ ముబారక్.. పథకాలను వెంటనే అమలు చేయాలి..

## బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు డిమాండ్..

దేవరకద్ర ఆగస్టు 17 ప్రజా వీక్షణం

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రజాపాలన ప్రభుత్వము వెంటనే కళ్యాణ లక్ష్మి..షాదీ ముబారక్.. పథకాలను అమలు చేయాలని కౌకుంట్ల మండల బి ఆర్ ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర బి ఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారము నియోజకవర్గ పరిధిలో కౌకుంట్ల మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలను నిరసిస్తూ ముఖ్యంగా కళ్యాణ లక్ష్మి పథకాన్ని రద్దు చేయడం పై నిరసిస్తూ కౌకుంట్ల మండల కేంద్రంలో ధర్నా కార్యక్రమం చేపట్టి తహసిల్దార్ కి, ఎంపీడీవో కి వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండల పార్టీ అధ్యక్షులు బాలచంద్ర గౌడ్, శ్రీకాంత్, బసవరాజ్, అన్ని గ్రామాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, విభాగాల అధ్యక్షులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.



ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
18 మంగళవారం ఆగస్టు 2026
7
www.prajaveekshanam.in

## జిల్లాలో వెదురు సాగుకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తుంచి,సాగు అవకాశాలపై సమగ్ర అధ్యాయం చేయాలి

### బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ : వి.వినోద్ కుమార్

బాపట్ల : ఆగష్టు 17 ( ప్రజా వీక్షణం )

బాపట్ల జిల్లాలో వెదురు సాగుకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తుంచి,సాగు అవకాశాలపై సమగ్ర అధ్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ : వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు.సోమవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీసీ హాల్ లో ' వెదురు ఆర్థిక వ్యవస్థ కమిటీ ' సమావేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.....ఇతర జిల్లాల్లో అమలవుతున్న వెదురు సాగు విధానాలను పరిశీలించి,బాపట్ల జిల్లాలో ప్రయోగాత్మకంగా సాగు చేపట్టెందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.వెదురు సాగు ద్వారా రైతన్నలకు అదనపు ఆదాయం సమకూరడంతో పాటు,స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా కార్యాచరణ ఉండాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## భక్తి శ్రద్ధతో పుట్ట దేవతకు పూజ..

దేవరకద్ర ఆగస్టు 17 ప్రజా వీక్షణం

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారము 9వ వార్షికోత్సవం సందర్భంగా నాగుల పంచమి రోజు అర్చకులు ఆలయ ప్రాంగణంలో భక్తి శ్రద్ధతో పుట్ట దేవత కు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కన్నయ్య దంపతులు, హరికాంత్ దంపతులు, సాయిబాబా దంపతులు, మహేష్ దంపతులు, జగదీష్ దంపతులు ఈశ్వర్ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాసేవలో జిల్లా పోలీసు యంత్రాంగం..

### ఆర్టీసీ డ్రైవర్ మరియు శ్రామిక్ ఉద్యోగులకు ఎంపికైన వారి సర్టిఫికెట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ జానకి

దేవరకద్ర ఆగస్టు 17 ప్రజా విక్షణం

మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని సోమవారం ఆర్టీసీ డ్రైవర్ మరియు శ్రామిక్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ లను జిల్లా ఎస్పీ జానకి పరిశీలించారు. ఈ వెరిఫికేషన్ ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోంది.ఈ ప్రక్రియలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 84 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ – 21 నాగర్‌కర్నూల్ – 21 వనపర్తి – 14 జోగులాంబ గద్వాల – 14 నారాయణపేట – 14 వీరిలో 64 మంది డ్రైవర్ పోస్టులకు, 20 మంది శ్రామిక్ పోస్టులకు ఎంపికయ్యారు.ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను జిల్లా ఎస్పీ డి. జానకి, స్వయంగా పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు తగు సూచనలు జేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఏవో రుక్మిణీ భాయ్, ఆర్ ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## సవరణ బిల్లుతో పురపాలక వ్యవస్థలో పారదర్శకత

### ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజా వీక్షణం)



పురపాలక సంఘాల్లో ఆస్తుల బదలాయింపు, పన్నుల విధానంలో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ బిల్లును తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ శాసనసభలో స్వాగతిం చారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సోమ వారం పురపాలక సవరణ బిల్లుపై జరిగిన చర్చలో ఎమ్మెల్యే మాట్లాడారు.ఈ బిల్లు ద్వారా ప్రజలకు మరింత సులభతరమైన, పారదర్శకమైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఆస్తి కొనుగోలు చేసిన వ్యక్తి ఆస్తి మార్పు కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధిత ఫీజు చెల్లించిన వెంటనే ఆస్తి బదలాయింపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం కల్పించడం ప్రభుత్వ ఘనతగా అభివర్ణించారు.ఇప్పటివరకు వివిధ పురపాలక సంఘాల్లో వేర్వేరు మ్యూటేషన్ ఛార్జీలు ఉండేవని, ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన ఫీజులు అమలు చేయడం మంచి నిర్ణయమని, దీనివల్ల ప్రజలపై అనవసరమైన భారాలు తగ్గడంతో పాటు, విధానంలో ఏకరూపత ఏర్పడుతుందని తెలిపారు.గతంలో పన్నుల విధింపు అధికారుల చేతుల్లో ఉండటం వల్ల కొన్ని సందర్భాల్లో అవకతవకలకు పాల్పడే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా పన్నులు విధించే విధానాన్ని తీసుకురావడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. ఇకనుంచి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో ఒకే విధానాన్ని అమలు చేయటం మంచి పరిణామమని చెప్పారు. ఆయా పురపాలక సంఘాల ఆర్థిక పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

# ఏలూరు జిల్లాలో నేవీ ఆయుధ డిపో కలవరం:...బోడిగూడెం రైతుధ్వజం!





కొయ్యలగూడెం మండలం ఆగష్టు 17 (ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బోడిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు ప్రక్రియ స్థానిక రైతుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. తమ భూములు కోల్పోతామనే భయంతో రైతులు పెద్ద ఎత్తున రోడ్డెక్కి నిరసన గళం వినిపించారు.గత ఏడాది డిసెంబర్‌లో కొయ్యలగూడెం మండలం బోడిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో నిర్మాణానికి సుమారు 1,300 ఎకరాల భూమిని సేకరించేం దుకు అధికారులు పరిశీలన చేపట్టారు. బోడిగూడెం పంచాయతీ పరిధిలోని మంగపతి దేవి పేట, బర్కెట్ నగర్, ఉట్లగూడెం, రేగులకుంట గ్రామాల్లో ఈ భూ సేకరణ జరగనుండటంతో స్థానిక రైతులు ఒక్కసారిగా భగ్గుమన్నారు .పూర్వం వైకాపా ప్రభుత్వ హయాంలో జీలుగుమిల్లి మండలం వంకవారిగూ డెంలో ఈ డిపో నిర్మాణానికి ప్రణాళిక రూపొందించగా, గ్రామస్తుల తీవ్ర వ్యతిరేకత, పోరాటాల కారణంగా ఆ ప్రయత్నం నిలిచిపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వ హయాంలోనూ అదే ప్రతిపాదన తెరపైకి రావడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్థానికులు టీడీపీ నాయకులను సైతం గ్రామాలలోకి రాకుండా అడ్డుకోవడంతో ప్రభుత్వం వెనకడుగు వేసింది.గత వారం రోజుల క్రితం ఈ నేవీ ఆయుధ డిపో అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కొందరు దళారులు, కొయ్యలగూడెం వ్యాపారుల తో కలిసి నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు తాము సిద్ధమేనంటూ తప్పుడు సందేశాలు పంపారని రైతులు




తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు.తమ జీవనాధారమైన భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయుధ డిపో నిర్మాణానికి ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం ఈ అంశంపై పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో భాగంగా కొయ్యలగూడెం తహశీల్దార్ కార్యాలయం వద్ద నేవీ ఆయుధ డిపో వద్దు అంటూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి, అనంతరం ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఆ తర్వాత జంగారెడ్డిగూ డెం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి, ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. భూములు కోల్పోతే తమ బతుకులు రోడ్డున పడతాయని, అలాగే ప్రాణాలను అయినా లెక్కచేయకుండా భూ సేకరణను అడ్డుకుంటామని రైతులు హెచ్చరిస్తున్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో చారిత్రక అడుగు:...రాష్ట్రవ్యాప్తంగా క్రాఫ్ట్ వుడ్ బ్యాంకుల ప్రారంభం





### హస్తకళల పరిరక్షణే ధ్యేయంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నూతన చొరవ

### రాజమహేంద్రవరంలో సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకు ప్రారంభం -- ఆరు క్లస్టర్లలో వర్చువల్ శ్రీకారం

### 5,000 హస్తకళాకారుల కుటుంబాలకు తీరనున్న ముడిసరుకు కొరత సమస్య

### రాజమహేంద్రవరం /

అమరావతి:ఆగష్టు 17(ప్రజా వీక్షణం)

మన సుసంపన్నమైన సాంస్కృతిక, వారసత్వ సంపద అయిన హస్తకళలను పరిరక్షించడంతో పాటు, వాటిపై ఆధారపడి జీవిస్తున్న కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో చారిత్రక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా హస్తకళాకారులకు ఎదురవుతున్న ముడిసరుకు కొరతకు శాశ్వత పరిష్కారం చూపుతూ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఘనంగా ప్రారంభించారు.తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలోని ధవళేశ్వరం వద్ద అటవీ శాఖ ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకును పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు (ఎమ్మెల్సీలు) మరియు అటవీ శాఖ ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళాకారులకు సంఘీభావం తెలిపారు. అనంతరం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆరు ప్రధాన క్లస్టర్ల పరిధిలోని క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులను ఆయన వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించారు .దశాబ్దాలుగా ముడిసరుకు (కలప) లభించక నానా ఇబ్బందులు పడుతున్న హస్తకళాకారులకు ఈ బ్యాంకుల ఏర్పాటుతో ఒక గొప్ప ఊరట లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 5,000 హస్తకళాకారుల కుటుంబాలకు ఈ బ్యాంకుల ద్వారా



నిరంతరం ముడిసరుకు అందుబాటులో ఉండనుంది. దీనివల్ల కళాకారులు మధ్యవర్తుల దోపిడీకి గురికాకుండా, నాణ్యమైన కలపను సులభంగా పొందవచ్చు .రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులో ప్రస్తుతం కళాకారుల అవసరాల నిమిత్తం 30 క్యూబిక్ మీటర్ల నాణ్యమైన కలపను సిద్ధంగా ఉంచారు. హస్తకళాకారులకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, వచ్చే ఐదేళ్లకు సరిపడా కలపను విడతలవారీగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని అటవీ శాఖ అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ప్రభుత్వం తీసుకున్న ఈ విప్లవాత్మక నిర్ణయం పట్ల రాష్ట్రంలోని హస్తకళాకారులు, కొయ్య చెక్కడాల నిపుణులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కాలంగా తమను వేధిస్తున్న ప్రధాన సమస్యకు ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు చొరవ తీసుకొని శాశ్వత పరిష్కారం చూపడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బ్యాంకుల ద్వారా రాష్ట్రంలో హస్తకళల రంగం పూర్వ వైభవాన్ని సంతరించుకోవడంతో పాటు, అంతర్జాతీయ మార్కెట్లో మన కళాకృతులకు మరింత ఆదరణ లభిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# ఏపీయూడబ్ల్యూజే 70 వసంతాలు..

## హక్కుల కోసం జర్నలిస్టుల మోటార్ సైకిల్ ర్యాలీ

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 17

(ప్రజా వీక్షణం)

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని తాడేపల్లిగూడెం పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ జిల్లా కమిటీ, తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. స్థానిక ఎస్వీఆర్ సర్కిల్ నుంచి ప్రారంభమైన జర్నలిస్టుల మోటార్ సైకిళ్ల ర్యాలీ ఆర్డీవో కార్యాలయానికి.చేరుకుని ఆర్డీవో ఎం.సూర్యారావుకు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. జర్నలిస్టుల సమస్యల ను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. అనంతరం అక్కడ నుంచి జర్నలిస్టులు ర్యాలీగా పెంటపాడు మండల రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్ వై.రవికుమార్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ముందుగా ఏపీయూడబ్ల్యూజే జిందాబాద్, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యడ్లపల్లి మురళీకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జర్నలిస్టుల కోసం పని చేస్తున్న ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ లో మన రాష్ట్రానికి చెందిన ఏపీయూడబ్ల్యూజే అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఐజేయు సెక్రటరీ జనరల్ గా తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన డి.సోమ సుందర్ ఎన్నిక కావడం ఎంతో గర్వకారణమని వివరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి గజపతి ప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనకు, వారి సంక్షేమానికి, వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు ఏడు దశాబ్దాలుగా ఏపీయూడబ్ల్యూజే కృషి చేస్తుందని తెలిపారు.ఈ ఏడాది పొడవునా యూనియన్ 70 వసంతాల ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు .ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలడుగు సతీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి ఏపీయుడబ్ల్యూజే నిరంతరం కృషి




చేస్తుందని వివరించారు. ఈ ప్రదర్శనలో ఏఐటీయూసీ నాయకులు ఓసూరి వీర్రాజు తాడికొండ శ్రీనివాస రావు సిపిఎం నాయకులు కర్రి నాగేశ్వరరావు బిజెపి నాయకులు నరిసే సోమేశ్వరరావు పాల్గొని పాత్రికేయులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ కేబుల్ మేనేజర్ వై. ఎన్.వి.రమేష్ సీనియర్ జర్నలిస్టులు షేక్ ఖాదర్ మోహుయుద్దీన్, చిక్కాల రామకృష్ణ, ఏ.వి.నరసింహారావు, కోలాటి మోషే బాబు, ఏ.వి.రామరాజు, ఆర్.కిషోర్, మైలవరపు రవి కిరణ్, శీలి రాజు, వానపల్లి పుండరీకాక్షుడు, మారంపూడి ఏసు, చింతకాయల దొరబాబు, శీలి మహేష్, గారపాటి ప్రసాద్, గంటా శివ, డోలా కళ్యాణ్, కమల్, బాసంశెట్టి బాల బాలాజీ, సింగులూరి వీర్రాజు, ఐతం ప్రసాద్, చిట్రోజు కృష్ణ, కళింగ లక్ష్మణరావు, సురగాల రాంబాబు, శీలి నరేష్, తాతిరాజు నాగేశ్వరరావు, ఎల్లారావు, జి.ఎం.రాజు, సతీష్, వీర్ల హరి, పవన్, చినిమిల్లి నాని, ఇంకా పలువురు పాత్రికేయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఓటరు ముసాయిదా జాబితా ప్రచురణ..

దేవరకద్ర ,ఆగస్టు 17 ప్రజా విక్షణం

దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించి ఓటరు ముసాయిదా జాబితాను సోమవారం దేవరకద్ర స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద నోటీసు బోర్డులో ప్రచురించారు. దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం పురుష ఓటర్లు 313275 మంది, మహిళా ఓటర్లు 316108 మంది, సర్వీస్ ఓటర్స్ 785 మంది, మొత్తం 629402 మంది ఓటర్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తాహ సిల్దార్ మమ్మద్ హర్షద్, ఎన్నికల డి టి అధికారి ఖాదర్, ఉప తాహసిల్దార్ దీపిక, ఆర్ ఐ శరత్ నాయక్, సాదత్, ఎలక్షన్ ఆపరేటర్ భాను,మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# రోటరీ క్లబ్ అఫ్ బాపట్ల ఆధ్వర్యంలో ఈ నెల 22,23 తేదిల్లో ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం

బాపట్ల : ఆగస్టు 17 ( ప్రజా వీక్షణం )

రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పట్టణంలోని రోటరీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బాపట్ల పట్టణంలోని విజయలక్ష్మిపురంలో ఉన్న రోటరీ కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి శిబిరం కొనసాగుతుందని తెలిపారు.డాక్టర్ నీలిమ ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఆక్యుపంక్చర్, డైట్ అండ్ న్యూట్రీషియన్, సుజోక్ థెరపీ తదితర వైద్య సేవలపై శిబిరంలో చికిత్స అందిస్తారని పేర్కొన్నారు. మెడ,వెన్ను,కీళ్ల నొప్పులు, తలనొప్పి,మైగ్రేన్,సయాటికా, ఆర్థ్రైటిస్, ఫ్రోజన్ షోల్డర్, ఒత్తిడి,నిద్రలేమి,జీర్ణ సంబంధ సమస్యలు,రుతుక్రమ అసౌకర్యాలు వంటి సమస్యలకు ఆక్యుపంక్చర్ ద్వారా ఉపశమనం పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరానికి ముందస్తు నమోదు, అపాయింట్‌మెంట్ తప్పనిసరని పేర్కొన్నారు.బాపట్ల నియోజకవర్గ ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వేజండ్ల శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, కోశాధికారి కోళ్లపూడి బాలాజీ, మెడికల్ క్యాంపు చైర్మన్ తాళ్లూరి మల్లికార్జునరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.



# జంగారెడ్డిగూడెంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి:...





## సబ్ ఇన్స్పెక్టర్ కుటుంబరావు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 17 (ప్రజా వీక్షణం):

ఏలూరు తర్వాత అతిపెద్ద పట్టణంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ క్రమబద్ధత పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ కుటుంబరావు స్పష్టం చేశారు. రోజురోజుకు పట్టణంలో వాహనాల సంఖ్య, ప్రజల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని, ఈ క్రమంలో వ్యాపారస్తులు, ప్రయాణికులు అందరూ ట్రాఫిక్ రూల్స్‌ను కచ్చితంగా పాటించాలని ఆయన కోరారు.రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపడం వల్ల ఇతర వాహనదారులకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన తెలిపారు. అదేవిధంగా దుకాణాల ముందు రోడ్లపై ఎలాంటి మెటీరియల్ వేయరాదని స్పష్టం చేశారు. రోడ్లను ఆక్రమించడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రమాదాలకు కూడా ఆస్కారం ఉంటుందని హెచ్చరించారు.ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రజలందరూ సహకరించాలని ఎస్ఐ కుటుంబరావు విజ్ఞప్తి చేస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సురక్షితమైన ప్రయాణం, సజావుగా సాగే రాకపోకల కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.

# ఏపీ నిట్ లో ఘనంగా రక్తదాన శిబిరం

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజా వీక్షణం)

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని టాస్క్ ఫోర్స్ క్లబ్, భవిష్య భారత్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రాంగణంలోని రవీంద్ర కళా భారతి ఆడిటోరియంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి చెందిన వైద్యాధికారులు డాక్టర్ రమ్యశృతి, డాక్టర్ స్వాతితో పాటు ఆసుపత్రి సిబ్బంది పలువురు ఆచార్యులు, విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. ఆచార్యులు, విద్యార్థులు విశేషంగా స్పందించి రక్తదానం చేశారు. ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందించాలనే సామాజిక బాధ్యతతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 50 మంది నుంచి రక్తదానం చేశారు. టాస్క్ ఫోర్స్ క్లబ్, భవిష్య భారత్ క్లబ్ సమన్వయకర్త, అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర రెడ్డి ఏర్వ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్.శంకర్ రెడ్డి, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినోత్ కుమార్ రాజా, ఆచార్యులు డాక్టర్ శీనివాసన్, ఎస్.భరణీ దరన్, క్లబ్ కార్యదర్శులు రీతూ సాత్విక (భవిష్య భారత్ క్లబ్), మనోజ్ చీదల్లా (టాస్క్ ఫోర్స్ క్లబ్) తదితరులు పాల్గొన్నారు.



# పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు:...జిల్లా కలెక్టర్ కే.వెట్రిసెల్వి





ఫిర్యాదుదారుల వద్ద స్నేహపూరిత వాతావరణంలో ఫిర్యాదులు స్వీకరించారు.

దివ్యాంగుల చెంతకు వెళ్ళి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక?టరు కె.వెట్రిసెల్వి.

ఏలూరు, ఆగస్టు 17:(ప్రజా వీక్షణం)

జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమం జిల్లా స్థాయి అధికారులతో కలిసి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె. అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి లు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజావాణికి విచ్చేసిన దివ్యాంగుల చెంతకు స్వయంగా వెళ్ళి వారి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ధరఖాస్తుల పరిష్కారంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించవద్దని హెచ్చరించారు. కొంతమంది అధికారులు దరఖాస్తులను క్రింద స్థాయి సిబ్బంది దగ్గరకు పంపిస్తున్నారని, కొందరు నా పరిధిలోనిది కాదని సమాధానం చెబుతున్నారని, ఇది క్షమించరాని నేరమని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో అర్జీదారుని వద్దకు వెళ్ళి వారితో ఫ్రెండ్లీగా మాట్లాడి వారి సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, నిర్ణీత సమయంలోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. ధరఖాస్తుల పరిష్కారంలో అర్జీదారుల నుండి ఒక్క ఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేల్చిచెప్పారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
18 మంగళవారం ఆగస్టు 2026
9
www.prajaveekshanam.in

## నేడు పోలవరం నియోజకవర్గంలో ఘనంగా సి.హెచ్. నవీన్ జన్మదిన వేడుకలు -- ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రత్యేక అభినందనలు!

టి. నర్సాపురం ఆగస్టు 17(ప్రజా వీక్షణం)



ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని, ప్రతి అడుగులోనూ అంకితభావంతో అండగా నిలిచిన నిజమైన జనసేన నాయకుడు సి.హెచ్. నవీన్ జన్మదినాన్ని పురస్కరించుకుని నేడు పోలవరం నియోజకవర్గంలో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు చిర్రి బాలరాజు స్వయంగా ఫోన్ ద్వారా సి.హెచ్. నవీన్‌ను పలకరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.పార్టీ బలోపేతం కోసం నవీన్ లాంటి నాయకులు అహర్నిశలు శ్రమిస్తూ, క్షేత్రస్థాయిలో పడిన కష్టం మరియు అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని ఎమ్మెల్యే ప్రశంసించారు. భగవంతుని ఆశీస్సులతో సి.హెచ్. నవీన్ పరిపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో రాజకీయంగా మరియు సామాజికంగా మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు

## పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 17 (ప్రజా వీక్షణం న్యూస్)

వరంగల్ పోలీస్ కమిషనరే ట్‌లో ఇటీవల ఎన్నికైన నూతన పోలీస్ అధికారు ల సంఘం కార్యవర్గ సభ్యు లు సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌ను సీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని పూల మొక్కలను అంద జేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నోడల్ అధికారి, అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, వరంగల్ కమిషన రేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులను పోలీస్ కమిష నర్‌కు పరిచయం చేశారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా కె. కరుణా కర్, ఉపాధ్యక్షులుగా బి. సతీష్, బి. శరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇ. వీరభద్రరావు, సంయుక్త కార్యదర్శిగా టి. నరేష్, కార్యనిర్వహణ కార్యదర్శి గా ఎస్. ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా బి. నరేష్, కార్యనిర్వాహక సభ్యులు గా ఎం. తులసి, సి.హెచ్. మహేందర్ యాదవ్, ఏ. రమేష్, ఎన్. ప్రవీణ్, ఎం. డి. తాజుద్దీన్, పి. సర్వేశ్ ఉన్నారు. అనంతరం పోలీ స్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన వరంగల్ కమిషనరేట్ పోలీ స్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులకు ముందుగా అభినందనలు తెలిపారు. పోలీస్ సిబ్బంది సమస్యలపై తక్షణమే స్పందించి, వాటిని సంబం ధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించా రు. పోలీస్ అధికారుల సంఘం సిబ్బందికి అండగా నిలుస్తూ, స్ఫూర్తిదాయకం గా పనిచేయాలని సీపీ ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో ఎన్నికల నోడల్ అధికారి, అదనపు డీసీపీ ప్రభాకర్‌రావు, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు నాగయ్య, సద య్యతో పాటు నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజావాణి వినతుల సత్వర పరిష్కారానికి చర్యలు

### హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 17 (ప్రజా వీక్షణం న్యూస్)

ప్రజావాణిలో అందిన విన తులను సత్వరం పరిష్క రించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధి కారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆమె, ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి పెండింగ్ లేకుండా పరిష్క రించాలన్నారు. మండల స్థాయి ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు అందు బాటులో ఉండి ప్రజా సమ స్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. హాస్టళ్లలో మౌలిక వసతులను పరి శీలించి, అవసరమైన పను లకు అంచనాలు రూపొం దించి త్వరగా పూర్తి చేయా లని ఆదేశించారు. ఈరోజు జిల్లాస్థాయిలో 127, రెవె న్యూ డివిజనల్ స్థాయిలో 47, మండల స్థాయిలో187 కలిపి మొత్తం 361 వినతు లు అందాయి. కార్యక్రమం లో అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఆపదలో ఉన్న మహిళలకు అండగా సఖి సెంటర్

### -- సఖి సెంటర్ అడ్మిన్ హైమావతి

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 17 (ప్రజా వీక్షణం న్యూస్)



ఆపదలో ఉన్న బాలికలు, మహిళలకు సఖి సెంటర్ అండగా నిలుస్తుందని సఖి సెంటర్ అడ్మిన్ హైమావతి తెలిపారు. బాధిత మహిళ లు సఖి కేంద్రం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు.సోమవారం ఎస్ఆర్ఎం జూనియర్ కళాశాలలో సర్వోదయ యూత్ ఆర్గ నైజేషన్, శ్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వ హించిన అవగాహన కార్య క్రమంలో ఆమె మాట్లాడా రు. మహిళలు, బాలికలకు అవసరమైన సహాయం, రక్షణ, కౌన్సెలింగ్ తదితర సేవలను సఖి కేంద్రం ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు తక్ష ణ సహాయం కోసం 181, 1098 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని హైమా వతి సూచించారు.కార్యక్రమంలో కేశవర్కర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ డీపీఆర్వోగా బండి పల్లవి బాధ్యతల స్వీకరణ

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 17 (ప్రజా వీక్షణం న్యూస్)

హనుమకొండ జిల్లా సమా చార, పౌరసంబంధాల అధి కారిగా (డీపీఆర్వో) బండి పల్లవి సోమవారం బాధ్య తలు స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్‌లో బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిని మర్యాదపూర్వకం గా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భం గా కలెక్టర్ ఆమెకు శుభా కాంక్షలు తెలిపారు.నూతనంగా డీపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన బండి పల్లవికి పలువురు జిల్లా అధికారులు, సమా చార శాఖ సిబ్బంది శుభా కాంక్షలు తెలిపారు.



## ఐటీఐ, పాలిటెక్నిక్, వొకేషనల్ కాలేజీల విలీనాన్ని నిలిపివేయాలి -- AIDSO

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 17 (ప్రజా వీక్షణం న్యూస్)

ఐటీఐ, పాలిటెక్నిక్, వొకేష నల్ విద్యా సంస్థలను విలీనం చేయొద్దని AIDSO తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం AIDSO తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టర్‌కు మెమోరాండం సమర్పిం చారు. తెలంగాణ ప్రభు త్వం జీఓ ఎంఎస్ నం.97 ద్వారా 'శక్తి' పేరుతో ఐటీ ఐలు, వొకేషనల్ విద్యా సంస్థలు, పాలిటెక్నిక్ కాలే జీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాల ని నిర్ణయించడాన్ని వారు వ్యతిరేకించారు. ఈ సంస్థ ల విద్యా విధానాలు, కోర్సు లు, శిక్షణ పద్ధతులు వేర్వే రుగా ఉన్నందున విలీనం తో విద్యా నాణ్యత, విద్యా ర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.విద్యార్థులు, ఉపాధ్యాయు లతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని, విలీన ప్రక్రి యను వెంటనే నిలిపివే యాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామ ని హెచ్చరించారు.







## విజయవాడలో వైభవంగా 'వీబీపుల్ట్ 2047' పోస్టర్ ఆవిష్కరణ!

విజయవాడ (ప్రజా వీక్షణం), ఆగస్టు 17:(ప్రజా వీక్షణం)

భారతీయ జనతా యువజన మోర్చా ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 'వికసిత్ భారత్ యంగ్ పొలిటికల్ లీడర్స్ డైలాగ్' 2047 కార్యక్రమ పోస్టర్‌ను విజయవాడలోని బెంజ్ సర్కిల్ వద్ద ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ కార్యకలాపాల డైరెక్టర్ మరియు ప్రముఖ వ్యాఖ్యాత దొడ్డపనేని కళ్యాణ్ కృష్ణ ఘనంగా ఆవిష్కరించారు. "యువ మేధస్సులు – బలమైన నాయకులు – బలమైన ఆంధ్రప్రదేశ్ – వికసిత్ భారత్" అనే ముఖ్య ఇతివృత్తంతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. 2026 ఆగస్టు 22, 23 తేదీలలో విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ లో జరగనున్న ఈ భారీ యువ నాయకత్వ కార్యక్రమానికి యువత పెద్ద సంఖ్యలో పేరు నమోదు చేసుకుని చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. యువ రాజకీయ నాయకులు మరియు రాజకీయాలపై ఆసక్తి ఉన్న యువత అర్థవంతమైన చర్చల్లో పాల్గొనేలా, అలాగే 2047 నాటికి బలమైన ఆంధ్రప్రదేశ్ మరియు వికసిత్ భారత్ నిర్మాణానికి తమ ఆలోచనలను పంచుకునేలా ఒక వేదికను కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అమరావతి బోటింగ్ క్లబ్ చైర్మన్ కాకాని తరుణ్, బీజేవైఎం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జి. శివకృష్ణరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసం సాయి తదితరులు పాల్గొన్నారు.



## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు

### -- హనుమకొండ కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధి కారి చాహత్ బాజ్ పాయి

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 17 (ప్రజా వీక్షణం న్యూస్)

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను మరిం త వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్ట రేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, సాగునీటిపారుదల శాఖల అధికారులతో కలెక్టర్ సమీ క్ష నిర్వహించారు. దరఖా స్తుల పరిశీలన, ఇప్పటివర కు చేపట్టిన చర్యలు, పురో గతిపై అధికారులను అడి గి తెలుసుకున్నారు. పోర్ట ల్ లో నమోదైన ఎల్ఆర్ ఎస్ దరఖాస్తులను సంబం ధిత శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయి లో పరిశీలించి, వాస్తవ పరి స్థితులను నిర్ధారించిన అనంతరం తదుపరి చర్య లు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఎల్ఆర్ఎస్ అనుమతుల కోసంవచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రక్రియను వేగ వంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, టౌన్ ప్లానింగ్ అధికారి జ్యోతి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు నస్రీన్ భాను, ప్రశాంత్, సాగునీటిపారు దల శాఖ అధికారులు వెన్నెల తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలిగా డా. సాగంటి మంజుల నియామకం

### 'అక్షర శ్రీ' విశిష్ట గౌరవ పురస్కారం అందజేత

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 17 (ప్రజా వీక్షణం న్యూస్)

విశ్వసాహితీ కళావేదిక జాతీయ సాహితీ సంస్థ తెలంగాణ రాష్ట్ర లలిత కళల విభాగం అధ్యక్షురాలి గా హనుమకొండకు చెందిన అధ్యాపకురాలు, రచయిత్రి, కవయిత్రి, చిత్ర కారిణి, సాంగటీస్ ఆర్ట్స్ అకాడమీ అధినేత డా. సాగంటి మంజులను నియమించారు.ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెంలో నిర్వ హించిన విశ్వసాహితీ కళా వేదిక ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమంలో డా. సాగంటి మంజుల తెలుగు సాహి త్య, కళా రంగాలకు అంది స్తున్న సేవలను గుర్తించి 'అక్షర శ్రీ' విశిష్ట గౌరవ పుర స్కారం అందజేశారు. మాస్ట్రో గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా పురస్కా రంతో పాటు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియామక పత్రాన్ని మంజులకు అందించారు.
కళలు, సాహిత్య రంగాల్లో మంజుల అందిస్తున్న సేవలకు మరింత గుర్తింపు కల్పించడంలో భాగంగానే ఈ నియామకం చేపట్టిన ట్లు జాతీయ అధ్యక్షురాలు రమావతి తెలిపారు. ఈ సందర్భంగా డా. సాగంటి మంజులను అభినందించా రు.



# యువతలో స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని నింపిన మహనీయుడు సుభాష్ చంద్రబోస్

## -తెల్లదొరలకు సింహ స్వప్నం... సుభాష్ చంద్రబోస్.
## -నేడు నేతాజీ వర్ధంతి (అదృశ్యం అయిన రోజు)

సుభాష్ చంద్రబోస్ భారత స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత ప్రముఖ నాయకులలో ఒకరు. నేతాజీగా పిలువబడే ఆయన జీవితాంతం దేశంలో, విదేశాల నుండి స్వాతంత్ర్యం కోసం పోరాడారు. నేతాజీగా ప్రసిద్ధిగాంచిన గొప్ప స్వతంత్ర్య సమరయోదుడు సుభాష్ చంద్రబోస్. 23 జనవరి 1897న భారత దేశంలోని ఒడిషా లోని కటక్ పట్టణం లో ఒక ధనిక కుటుంబంలో జన్మించాడు. అతని తండ్రి జానకినాథ్ బోస్ లాయరు. తీవ్రమైన జాతీయవాది. బెంగాల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ కి కూడా ఎన్నికయ్యాడు. తల్లి పేరు ప్రభావతి దేవి. బోస్ విద్యాభ్యాసం కటక్‌లోని రావెన్షా కాలేజియేట్ స్కూలులోను, కలకత్తాలోని స్కాటిష్ చర్చి కాలేజిలోను, ఫిట్జ్ విలియమ్ కాలేజిలోను, ఆపై కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం లోను సాగింది. 1920 లో బోస్ భారతీయ సివిల్ సర్వీసు పరీక్షలకు హాజరై అందులో నాలుగవ ర్యాంకులో నిలిచాడు. ఇంగ్లీషులో అత్యధిక మార్కులు సాధించాడు. అయినా 1921 ఏప్రిల్‌లో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ సివిల్ సర్వీసు నుండి వైదొలగి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొననారంభించాడు. భారత జాతీయ కాంగ్రెస్ యువజన విభాగంలో చురుకైన పాత్ర నిర్వహించ సాగాడు.ఒకవైపు గాంధీజీ మొదలైన నాయకులందరూ అహింసావాదం తోనే స్వరాజ్యం సిద్ధిస్తుందని నమ్మి పోరాటం సాగిస్తుంటే బోస్ మాత్రం సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టవచ్చునని నమ్మి, అది ఆచరణలో పెట్టి తెల్లదొరలకు సింహ స్వప్నం గా మారిన మహనీయుడు. ఇతని మరణం పై పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. బోసు రెండు సార్లు భారత జాతీయ కాంగ్రెస్ కు అధ్యక్షుడిగా ఎన్నికైనా గాంధీ తో సిద్ధాంత పరమైన అభిప్రాయ భేదాల వలన ఆ పదవికి రాజీనామా చేశాడు. గాంధీ యొక్క అహింసావాదం మాత్రమే స్వాతంత్ర్య సాధనకు సరిపోదని, పోరుబాట కూడా ముఖ్యమని బోసు భావన. ఈ అభిప్రాయాలతోనే ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ అనే రాజకీయ పార్టీని కూడా స్థాపించాడు. దాదాపు 11 సార్లు ఆంగ్లేయులచే కారాగారంలో నిర్బంధించ బడ్డాడు. 1939 లో రెండవ ప్రపంచ యుద్ధం మొదలైంది. ఆంగ్లేయులను దెబ్బ తీయటానికి దీన్ని ఒక సువర్ణవకాశంగా బోసు భావించాడు. యుద్ధం ప్రారంభం కాగానే అతను ఆంగ్లేయుల పై పోరాడేందుకు కూటమి ఏర్పాటు చేసే ఉద్దేశంతో రష్యా, జర్మనీ, జపాను దేశాలలో పర్యటించాడు. జపాను సహాయంతో భారత యుద్ధ ఖైదీలు, రబ్బరు తోట కూలీలు మరియు ఔత్సాహికులతో భారత జాతీయ సైన్యం ను ఏర్పాటు చేశాడు. జపాను ప్రభుత్వం అందించిన సైనిక, ఆర్థిక, దౌత్య సహకారాలతో ఆజాద్ హింద్ ప్రభుత్వం ను సింగపూర్ లో ఏర్పరచాడు. బోసు రాజకీయ అభిప్రాయాలు, జర్మనీ, జపాను తో అతని మిత్రత్వం పై చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరు వీటిని విమర్శిస్తే, మరి కొందరు వాస్తవిక దృష్టితో చేసిన ప్రయత్నాలుగా బోసును అభిమానిస్తారు. అతని జీవితం లాగే మరణం కూడా వివాదాస్పదమైంది. 18 ఆగస్టు, 1945 లో తైవాన్ లో జరిగిన విమాన ప్రమాదం లో బోసు మరణించాడని ప్రకటించినప్పటికి, అతని మృదేహం మాత్రం లభించలేదు. అతను ప్రమాదం నుంచి బయట పడి అజ్ఞాతం లోకి వెళ్ళాడని పలువురు నమ్ముతారు. దీని వల్ల ఆయన బతికి ఉండవచ్చునని ఎన్నో కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. వాటిలో ఒకటి బోస్ సోవియట్ యూనియన్కు బందీగా ఉండగా సైబీరియాలో మరణించాడని. దీనిని విచారించడానికి భారత ప్రభుత్వం చాలా కమిటీలను ఏర్పాటు చేసింది. 1956 మే నెలలో నలుగురు సభ్యులతో కూడిన షానవాజ్ కమిటీ బోస్ మరణాన్ని గురించి విచారించడానికి



జపాన్కు వెళ్ళింది. అప్పట్లో భారత్ కు తైవాన్ తో మంచి సంబంధాలు లేకపోవడంతో వారి సహకారం కొరవడింది. దాంతో ఇది ఆశించినంత ఫలితాలు ఇవ్వలేదు. కానీ 1999-2005 లో విచారణ చేపట్టిన ముఖర్జీ కమిషన్ తైవాన్ ప్రభుత్వంతో చేతులు కలిపి బోసు ప్రయాణిస్తున్న ఏ విమానమూ అక్కడ కూలిపోలేదని నిర్ధారణకు వచ్చింది. అంతే కాకుండా అమెరికా ప్రభుత్వం కూడా దీన్ని సమర్థిస్తూ ఈ కమిషన్ కు లేఖను పంపడం జరిగింది.ఈ కమిషన్ తన నివేదికను నవంబర్ 8, 2005 ప్రభుత్వానికి సమర్పించింది. దీన్ని ప్రభుత్వం మే 17, 2006లో పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ఈ కమిషన్ నివేదిక ప్రకారం బోస్ విమాన ప్రమాదంలో చనిపోలేదనీ, రెంకోజీ గుడిలో ఉన్నది ఆయన చితాభస్మం కాదని తేలింది. అయితే భారత ప్రభుత్వం మాత్రం ఈ కమిషన్ నివేదికను తిరస్కరించింది. స్వాతంత్ర్య పోరాటం కోసం ప్రతిక్షణమూ పాటుపడిన నేతాజీ మరణవిషయం నేటికీ అనుమానాస్పందంగానే ఉంది.

# మద్యం తాగి వాహనం నడిపితే యువకునికి 8 రోజుల జైలు శిక్ష!

### ఏలూరు వన్‌టౌన్ సీఐ రామకృష్ణ హెచ్చరిక: "ఇకపై జైలు శిక్ష తప్పదు!"

### బాధ్యతగా వ్యవహరించాలని పౌరులకు పోలీసుల విజ్ఞప్తి

ఏలూరు ఆగష్టు 17( ప్రజా వీక్షణం )




రోడ్లపై ప్రాణాలను హరించేలా మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి ఏలూరు పోలీసులు గట్టి హెచ్చరిక జారీ చేశారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ మత్తులో డ్రైవింగ్ చేసే వారికి ఇకపై కేవలం జరిమానాలతో సరిపెట్టే ప్రసక్తే లేదని, నేరుగా జైలు ఊచలు లెక్కించాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు.ఇటీవల ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన ఓ యువకుడి ఉదంతం ఇందుకు అద్దం పడుతోంది. ఈ కేసుకు సంబంధించి విచారణ చేపట్టిన స్థానిక న్యాయస్థానం నిందితుడికి 8 రోజుల పాటు జైలు శిక్ష విధించింది. ఈ తీర్పు డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారికి ఒక కఠినమైన హెచ్చరికగా నిలిచింది.ఈ నేపథ్యంలో ఏలూరు వన్‌టౌన్ సీఐ రామకృష్ణ మీడియా ముఖంగా మాట్లాడతూ.. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఎవరైనా సరే మద్యం సేవించి రోడ్లపైకి వస్తే ఉపేక్షించేది లేదని, కోర్టు ద్వారా కఠినమైన జైలు శిక్షలు ఖరారవుతాయని తేల్చిచెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కేవలం డ్రైవర్ మాత్రమే కాకుండా, రోడ్డుపై వెళ్లే నిరపరాధుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలని, బాధ్యతగల పౌరులుగా మత్తులో వాహనాలు నడిపే అలవాటును మానుకోవాలని సీఐ రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ప్రాణాలను పణంగా పెట్టే ఈ దుర్వ్యాపారాన్ని అరికట్టేందుకు పోలీసు శాఖ తరపున తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మరోసారి స్పష్టం చేశారు.

# దృష్టి మళ్లించి బంగారు ఆభరణాల చోరీ

### దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా గుట్టురట్టు

### ఆరుగురు నిందితుల అరెస్ట్..భారీగా ఆభరణాలు స్వాధీనం

హైదరాబాద్,ఆగస్ట్17( ప్రజా వీక్షణం ):

హైదరాబాద్ నగరంలో గత కొంత కాలంగా అమాయకుల దృష్టి మళ్లించి బంగారు ఆభరణాల చోరీలకు పాల్పడుతున్న ముఠా గుట్టును లంగర్‌హౌస్ పోలీసులు ఛేదించారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి భారీగా బంగారు ఆభరణాలు, నగదు, వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు అమాయకులను టా÷-గ్గ÷ట్ చేసుకొని వారి దృష్టిని మళ్లించి విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలను అపహరిస్తున్నారు. వరుసగా జరుగుతున్న చోరీలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సీసీటీవీ టీవీ ఫుటేజీలను పరిశీలించి, నిందితుల కదలికలను గుర్తించారు. ఆధారాలను సేకరించిన అనంతరం ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. దృష్టి మళ్లించి చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో సయ్యద్ అసద్, ఒమర్ ఖాన్, సయ్యద్ మొయిన్, అజర్ హుస్సేన్, మహ్మద్ ఇబ్రహీం, సయ్యద్ అబ్దుల్ మజీద్ ఉన్నారు. అరెస్టైన నిందితుల నుంచి మొత్తం 13.5 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో నాలుగు బంగారు గాజులు, మూడు బంగారు గొలుసులు, ఒక లాకెట్, మూడు ఉంగరాలు ఉన్నాయి. వీటితో పాటు రూ.7.40 లక్షల నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. చోరీలకు ఉపయోగించినట్లు అనుమానిస్తున్న ఆటో, ఒక ద్విచక్ర వాహనం, ఆరు సెల్‌ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన నిందితుల్లో కొందరిపై గతంలోనే వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో షీటర్ కేసులు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది

# బహుజన తొలి విప్లవ వీరుడు,తెలంగాణా శివాజీ మన సర్వాయి పాపన్న

## -నేడు ఆయన 376వ జయంతి

బహుజన తొలి విప్లవ వీరుడు ...తెలంగాణా శివాజీ మన సర్వాయి పాపన్న.. ఆయన వరంగల్ జిల్లా జనగాం దగ్గర కైలాస్ పూర్ గ్రామంలో గౌడ కులంలో 1650 లో జన్మించారు, తండ్రి చిన్న తనం లోనే చనిపోయారు, సర్వమ్మ అతడి తల్లి, పాపడు అని అతన్ని పిలిచేవారు.పాపన్న ఎల్లమ్మకు పరమ భక్తుడు, అతను శివున్ని ఆరాధించేవాడు, తల్లి కోరిక మేరకు గౌడ వృత్తిని స్వీకరించాడు, కాని అతని మనసులో మాత్రం తెలంగాణా లో అంతకంతకు పెరుగుతున్న ముస్లింల ఆధిపత్యాన్ని అంతం చెయ్యాలని ఉండేది, అందుకోసం అతను గెరిల్ల సైన్యాన్ని తాయారు చేసాడు, ఆ సైన్యం ద్వారా మొగలు సైన్యం పై దాడి చేసే వాడు,1675 లో సర్వాయి పేట లో తన రాజ్యాన్ని స్థాపించాడు, తన సొంత ఊరు కైలాస్ పూర్ రాజధాని. ఇతను శివాజీకి సమకాలికుడు, శివాజీ ముస్లింల పాలనా అంతానికి మహారాష్ట్రలో ఎలాగైతే పోరాడాడో, పాపన్న కూడా తెలంగాణాలో ముస్లింల పాలనా అంతానికి పోరాడాడు, 1687 - 1724 వరకు అప్పటి మొగల్ చక్రవర్తి ఔరంగాజేబ్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడాడు, పాపన్న ఒక్కో ప్రాంతాన్ని ఆక్రమించి విజయ దుర్గాలు నిర్మించాడు, 1678 వరకు తాటికొండ, వేములకొండాలను తన ఆధీనం లోకి తెచ్చుకొని దుర్గాలను నిర్మించాడు, 1700 - 1705 మధ్య కలం లో షా పుర లో మరొక దుర్గం నిర్మించాడు, అతని సామ్రాజ్యం తాటికొండ, కొలనుపాక, చేర్యాల నుండి కరీం నగర్ జిల్లా లోని హుసనాబాద్, హుజురా బాద్ విస్తరించింది, భువనగిరి కోటను రాజధానిగా చేసుకొని అతను ముప్పై సంవత్సరాలు పరిపాలించాడు.పాపన్న ఒక సాధారణ గౌడ కుటుంబం నుండి వచ్చిన వాడు కనుక అతనికి ప్రజల కష్ట నష్టలన్నీ తెలుసు, అందుకే పాపన్న రాజ్యంలో పన్నులు లేవు, ఖజానా కొరకు అతను జమిందార్, సుబేదార్ లపై తన గెరిల్ల సైన్యంతో దాడి చేయించేవాడు, పాపన్న అనేక ప్రజామోద యోగ్యమైన పనులు చేసాడు, అతని రాజ్యం లో సామజిక న్యాయం పాటించేవాడు, తాటి కొండలో చెక్ డాం నిర్మించాడు, అతను ఎల్లమ్మకు పరమ భక్తుడు కావున హుజురా బాద్ లో ఎల్లమ్మ గుడి కట్టించాడు, అది నేటికి రూపం మారిన అలానే ఉంది.పాపన్న గెరిల్ల సైన్యం తో మొగల్ సైన్యం పై దాడి చేస్తున్నాడని ఔరంగజేబ్ కు తెలిసింది, అతడు రుస్తుం దిల్ ఖాన్ కు భాద్యతలు అప్పగించాడు, రుస్తుం దిల్ ఖాన్ యుద్దానికి ఖాసిం ఖాన్ ను పంపించాడు, శఃపుర వద్ద ఇరు సైన్యాలు తలపడ్డాయి, నెలలపాటు యుద్ధం జరిగింది, చివరికి రుస్తుం దిల్ ఖాన్ రంగం లోకి దిగాడు, సుమారు 3 నెలలపాటు యుద్ధం జరిగింది, పాపన్న తన ప్రాణ స్నేహితున్ని కోల్పోయాడు, దాంతో ఆయన యుద్దాన్ని విరమించుకున్నాడు, అతను అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు, మొగల్ సైన్యాలు అతని కోసం వెతకడం ప్రారంభించాయి, అయితే పాపన్న తన సొంత ఊరు జనగామ కు వెళ్లి అక్కడ గౌడ కులం వారు ఎక్కువగా ఉండే చోట జీవితం గడిపాడు, ఔరంగజేబ్ మరణించిన తర్వాత దక్కన్ పాలకుడు కంబక్ష్ ఖాన్ బలహీన పాలనను చుసిన పాపన్న 1 ఏప్రిల్ 1708 లో



వరంగల్ కోటపై దాడి చేసాడు, అయితే ఈ దాడిలో పాపన్న పట్టుబడ్డాడు. 1708 లో గోల్కొండకు తీసుకెళ్ళి పాపన్న తల తీసి కోట ముఖ ద్వారానికి వెల్లడ దీసారు. తెలంగాణా పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర సమైక్య పాలన లో అజ్ఞాతంలోకి వెళ్ళింది, బహుజన గౌడ కులానికి చెందిన పాపన్న జీవిత చరిత్రను కమ్మ కుల ఆధిపత్యం గల ఆంధ్ర వాళ్ళు బయటికి రాకుండా చేసారు, మన పోరాట యోధులను మనమే గుర్తించాల్సిన అవసరం, ఆ భాద్యత మనపైనే ఉంది.

# యువతిని హత్య చేసిన ప్రియుడు

### గర్భం దాల్చడంతో తప్పించుకునే యత్నం

### దుండగుడి కోసం పోలీసులు గాలింపు

హైదరాబాద్,ఆగస్ట్17( ప్రజా వీక్షణం ):

హైదరాబాద్‌లోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి దారుణ హత్యకు గురైంది. ప్రియురాలిని ప్రియుడు హత్య చేసినట్లు తెలుస్తోంది. ప్రియురాలిపై అనుమానమే ఈ హత్యకు కారణమని బాలాపూర్ పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందగానే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని, క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. మృతురాలిని బిహార్‌కు చెందిన యువతిగా గుర్తించారు. స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్లో మృతురాలు పనిచేస్తోంది. మృతురాలికి ప్రేమ పేరుతో బాలాపూర్‌కు చెందిన అహ్మద్ దగ్గరయ్యాడు. ఇటీవల యువతి గర్భం దాల్చింది. ఈ విషయాన్ని అహ్మద్‌కు మృతురాలు చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఆమె గర్భం దాల్చడంతో తనను పెళ్లి చేసుకోవాలని అతడిని బలవంతం చేసింది. దీంతో ప్రియురాలిని అడ్డు తొలగించుకోవడానికి ప్రియుడు ప్లాన్ చేశాడు. తల్లిదండ్రులతో కలిసి యువతిని అహ్మద్ హత్య చేసినట్లు సమాచారం. నిన్న (ఆదివారం) రాత్రి మృతదేహాన్ని గోనే సంచిలో తరలిస్తుండగా స్థానికులు అనుమానించారు. వెంటనే పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారంతో రెడ్ హ్యాండెడ్‌గా అహ్మద్‌ను పోలీసులు పట్టుకున్నారు. అహ్మద్‌తో పాటు అతని తల్లిదండ్రులను కూడా అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ప్రస్తుతం ఉస్మానియా మార్చురీలో యువతి మృతదేహాన్ని ఉంచారు.

# భారత్‌కు భారీ ఆధిక్యం!

**- శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకు ఆలౌట్ - సోనాల్ దినుషా సెంచరీ.. రాణించిన నిరోషన్ డిక్‌వెల్లా - నాలుగు వికెట్లతో అదరగొట్టిన బౌలర్ మానవ్ సుతార్ - భారీగా వర్షం రావడంతో ముగిసిన మూడో రోజు ఆట..**




శ్రీలంకతో తొలి టెస్ట్‌లో భారత్‌కు భారీ ఆధిక్యం లభించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 79.4 ఓవర్లలో 284 పరుగులకు కుప్పకూలింది. సోనాల్ దినుషా(100) సెంచరీతో చెలరేగగా.. నిరోషన్ డిక్‌వెల్లా(115 బంతుల్లో 7 ఫోర్లతో 80) హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(4/76) నాలుగు వికెట్లు తీయగా.. రవీంద్ర జడేజా(3/57) మూడు వికెట్లు పడగొట్టాడు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు. అంతకుముందు 460/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు కుప్పకూలింది. దేవదత్ పడిక్కల్(230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 167) సెంచరీతో రాణించగా.. కేఎల్ రాహుల్(175 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 82) శతకాన్ని చేజార్చుకున్నాడు. ధ్రువ్ జురెల్(68 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య(4/109) నాలుగు వికెట్లు తీయగా.. కేశర నువాంత(3/175) మూడు వికెట్లు పడగొట్టాడు. అసితా ఫెర్నాండో(2/63) రెండు వికెట్లు తీసాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు భారత బౌలర్లు షాకిచ్చారు. సిరాజ్, జడేజా, మానవ్ సుతార్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. దాంతో శ్రీలంక 99/5 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. తొలి సెషన్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. రెండో సెషన్‌లో సోనాల్ దినుషా, నిరోషణ్ డిక్‌వెల్లా శ్రీలంకను ఆదుకున్నారు. అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఈ క్రమంలో నిరోషన్ డిక్‌వెల్లా 67 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. దినుషా 92 బంతుల్లో అర్ధశతకాన్ని అందుకున్నాడు. దాంతో శ్రీలంక 215/5 స్కోర్ టీ బ్రేక్‌కు వెళ్లింది. దినుషా, డిక్‌వెల్ల అద్భుత బ్యాటింగ్‌తో రెండో సెషన్‌లో శ్రీలంకనే పైచేయి సాధించింది.ఆఖరి సెషన్‌లో భారత బౌలర్లు జూలు విధిల్చారు. 146 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. సెంచరీ దిశగా సాగిన నిరోషన్ డిక్‌వెల్లా(80)ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో మ్యాచ్ భారత్‌వైపు మలుపు తిరిగింది. ఆ వెంటనే కేశర నువాంత(2)ను జడేజా ఔట్ చేయగా.. ప్రభాత్ జయసూర్య(10)ను మానవ్ సుతార్ వెనక్కిపంపాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు సోనాల్ దినుషా.. 167 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ మరుసటి బంతికే అతన్ని జడేజా ఎల్బీగా పెవిలియన్ మార్చాడు. లాహిరు కుమార(10)ను మానవ్ సుతార్ ఔట్ చేయడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఆ వెంటనే వర్షం రావడంతో అంపైర్లు మూడో రోజు ఆటను ముగించారు. నాలుగో రోజు ఆటలో భారత్ తొలి సెషన్‌లోనే 130 పరుగులు చేసి శ్రీలంక ముందు 300 ప్లస్ రన్స్ లక్ష్యాన్ని నమోదు చేయాలి. అప్పుడే ఈ మ్యాచ్ భారత్ వశమవుతోంది. వర్షం అంతరాయం కలిగిస్తున్న నేపథ్యంలో చాలా తెలివిగా ఆడాల్సిన అవసరం ఉంది.

# చరిత్ర సృష్టించిన రవీంద్ర జడేజా..

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు.టెస్ట్ క్రికెట్‌లో 350 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. తద్వారా టెస్ట్‌ల్లో 350 వికెట్లతో పాటు 4000కిపైగా పరుగులు చేసిన రెండో భారత ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. శ్రీలంకతో గాలే వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో రవీంద్ర జడేజా ఈ ఫీట్ సాధించాడు. శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా,కేశర నువంతలను ఔట్ చేయడం ద్వారా ఈ ఘనతను అందుకున్నాడు. ఓవరాల్‌గా టెస్ట్‌ల్లో 350 వికెట్లు తీసిన ఐదో బౌలర్‌గా జడేజా నిలిచాడు. అతనికి ముందు అనిల్ కుంబ్లే(619), రవిచంద్రన్ అశ్విన్(537), కపిల్ దేవ్(434), హర్భజన్ సింగ్(417) మాత్రమే 350 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో ఇప్పటి వరకు జడేజా 4,095 పరుగులు చేశాడు. 350 వికెట్లతో పాటు 4000 ప్లస్ రన్స్ చేసిన నాలుగో ఆల్‌రౌండర్‌గా జడేజా నిలిచాడు. కపిల్ దేవ్, ఇయాన్ బోథమ్(ఇంగ్లండ్), డేనియల్ వెటోరి(న్యూజిలాండ్) మాత్రమే జడేజా కంటే ముందు ఈ ఫీట్ సాధించాడు. అంతేకాకుండా టెస్ట్‌ల్లో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్టార్మ్ స్పిన్నర్లలో జడేజా మూడో స్థానంలో నిలిచాడు. రంగన హెరత్(శ్రీలంక) 433 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా.. డేనియల్ వెటోరి(న్యూజిలాండ్) 362 వికెట్లు, రవీంద్ర జడేజా(భారత్) 350 వికెట్లు, డెరెక్ అండర్ వుడ్(ఇంగ్లండ్) 297 వికెట్లు, తైజుల్ ఇస్లామ్(బంగ్లాదేశ్) 271 వికెట్లు ఈ జాబితాలో ఉన్నారు. టెస్ట్‌ల్లో కనీసం 125 వికెట్లు తీసిన లెఫ్టార్మ్ స్పిన్నర్లలో సౌతాఫ్రికాకు చెందిన కేశవ్ మహారాజ్(56.4) తర్వాత జడేజా(58.1) రెండో అత్యుత్తమ స్ట్రైక్‌రేట్‌ను కలిగి ఉండటం మరో విశేషం. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు ఆలౌటైంది. దేవదత్ పడిక్కల్(230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 167) సెంచరీతో రాణించగా.. కేఎల్ రాహుల్(175 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 82) శతకాన్ని చేజార్చుకున్నాడు. ధ్రువ్ జురెల్(68 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య(4/109) నాలుగు వికెట్లు తీయగా.. కేశర నువాంత(3/175) మూడు వికెట్లు పడగొట్టాడు. అసితా ఫెర్నాండో(2/63) రెండు వికెట్లు తీసాడు.అనంతరం శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 79.4 ఓవర్లలో 284 పరుగులకు ఆలౌటైంది. సోనాల్ దినుషా(100) సెంచరీతో చెలరేగగా.. నిరోషన్ డిక్‌వెల్లా(115 బంతుల్లో 7 ఫోర్లతో 80) హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(4/76) నాలుగు వికెట్లు తీయగా.. రవీంద్ర జడేజా(3/57) మూడు వికెట్లు పడగొట్టాడు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు. దాంతో భారత్‌కు 178 పరుగుల భారీ ఆధిక్యం లభించింది.

# రుతురాజ్ గైక్వాడ్ చెత్త కెప్టెన్..

అతని కెప్టెన్సీలో సీఎస్‌కే ప్లే ఆఫ్స్ కూడా చేరదు రుతురాజ్ పై సంజూ శాంసన్ తీవ్ర విమర్శలు!! చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ చెత్త కెప్టెన్ అని ఆ జట్టు స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ అన్నట్లు ఓ ఫేక్ న్యూస్ నెట్టింట వైరల్ అవుతుంది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో సీఎస్‌కే ఫైనల్ కూడా చేరదని సంజూ అన్నట్లుగా ఉన్న ఈ పోస్ట్ నెట్టింట తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే ఈ ఫేక్ పోస్ట్ అని భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా అన్నాడు. ఏ ఇంటర్వ్యూలో కూడా సంజూ ఈ వ్యాఖ్యలు చేయలేదని తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడుతూ స్పష్టం చేశాడు. సీఎస్‌కే తరఫున ఏ బాధ్యతలైనా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నానని సంజూ అన్నట్లుగా ఈ ఫేక్ పోస్ట్‌ను క్రియేట్ చేశారు. 'రుతురాజ్ విఫలమయ్యాడు.. సీఎస్‌కే సారథ్య బాధ్యతలు అందుకునేందుకు సిద్ధంగా ఉన్నారా? 'అని ఇంటర్వ్యూయర్ ప్రశ్నించగా.. 'అవును. సీఎస్‌కే తరఫున ఏ బాధ్యతలైనా చేపట్టేందుకు రెడీగా ఉన్నా. కెప్టెన్‌గా నాకు అనుభవం ఉంది. రుతురాజ్ సారథ్యంలో సీఎస్‌కే సాధించిందేం లేదు.అతనో చెత్త కెప్టెన్. వరల్డ్ బెస్ట్ ఎలెవన్ ఇచ్చినా అతను ఏం చేయలేడు. కనీసం సీఎస్‌కేను ప్లే ఆఫ్స్ కూడా చేర్చలేడు. సీఎస్‌కే నాకు కెప్టెన్సీ బాధ్యతలు ఇస్తే.. స్వీకరిస్తా. రుతురాజ్ ఏం చేయలేడు. అందుకే సీఎస్‌కే సారథ్య బాధ్యతలు చేపట్టాలనుకుంటున్నా.'అని సంజూ శాంసన్ అన్నట్లుగా ఫేక్ పోస్ట్ క్రియేట్ చేశారు. ఈ పోస్ట్‌పై స్పందించిన ఆకాశ్ చోప్రా.. ఫేక్ అని తేల్చేసాడు. అందరూ నమ్మదగిన రీతిలో రాసుకొచ్చారని పేర్కొన్నాడు. ఇలాంటి ఇంటర్వ్యూ జరగలేదని స్పష్టం చేశాడు. 'సీఎస్‌కే తరఫున ఎలాంటి బాధ్యతలైనా చెప్పట్టేందుకు సిద్ధంగా ఉన్నానని సంజూ చెప్పాడు. ఇది సరైనదే. నమ్మదగిన రీతిలోనేఉంది. ఇంటర్వ్యూయర్ రుతురాజ్ విఫలమయ్యాడు. సీఎస్‌కే సారథ్య బాధ్యతలు చెపడుతారా? అని అడిగాడు. సంజూ.. అందుకు సిద్ధంగా ఉన్నానని, సీఎస్‌కే కోసం ఏమైనా చేస్తానని, రుతురాజ్ సారథ్యంలోనే సీఎస్‌కే సాధించిందేం లేదన్నాడు. రుతురాజ్ చెత్త కెప్టెన్. అతను జట్టును ప్లే ఆఫ్స్ కూడా చేర్చలేదని చెప్పాడు. జనాలు ఈ పోస్ట్ చదివితే నిజమేనని అంటారు. సీఎస్‌కే కెప్టెన్సీకి సంజూనే సరైనవాడని కూడా అంటారు. అతనికి ఒక్క అవకాశం ఇవ్వాలని కూడా సూచిస్తారు. అయితే కొందరు మాత్రం ఈ ఇంటర్వ్యూ లింక్ అడిగారు. అయితే ఈ ఇంటర్వ్యూ ఎక్కడా జరగలేదు. సంజూ శాంసన్ ఎక్కడా ఇలా చెప్పలేదు. ఇది ఫేక్ న్యూస్. అసలు ఈ తరహా ఇంటర్వ్యూనే జరగలేదు. సంజూ అనలేదు'అని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు. 2024 నుంచి సీఎస్‌కే ప్లే ఆఫ్స్ చేరలేదు.









# ఇంగ్లాండ్ చేతిలో భారత్ కు ఓటమి

**- హాకీ వరల్డ్‌కప్‌లో భారత్‌కు తొలి ఓటమి - ఉత్కంఠభరితంగా కొనసాగిన మ్యాచ్ - 19న పాకిస్థాన్‌తో భారత్ మూడో మ్యాచ్**

2026 హాకీ వరల్డ్?కప్?లో భారత్ పురుషుల జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. పూల్ డీలో భాగంగా సోమవారం ఇంగ్లాండ్?తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్?లో భారత్ 4-2 తేడాతో ఓడిపోయింది. దీంతో రెండో రౌండ్‌కు భారత్? అర్హత సాధించాలంటే తదుపరి పాకిస్థాన్‌పై మ్యాచ్?లో తప్పక నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ వేల్స్?పై ఇంగ్లాండ్ గెలిస్తే, పాక్?తో మ్యాచ్?ను డ్రా చేసుకున్నా సరిపోతుంది. పూల్ స్టేజ్?లో భాగంగా ఆమ్‌స్టల్‌వీన్‌లోని వాగ్నర్ హాకీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ ? ఉత్కంఠభరితంగా సాగింది. తొలి క్వార్టర్‌లో ఇంగ్లాండ్ జట్టు ప్రారంభంలోనే ఒక గోల్ చేసి 1-0 ఆధిక్యాన్ని సాధించింది. అయితే, రెండో క్వార్టర్‌లో భారత్ అద్భుతంగా పుంజుకుంది. ఏకంగా రెండు గోల్స్ సాధించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్ ద్వారా ఒక గోల్ చేయగా, అదే క్వార్టర్‌లో దిల్ప్రీత్ సింగ్ మరో గోల్ చేసి భారత్‌కు 2-1 ఆధిక్యాన్ని అందించారు. అయితే మూడో క్వార్టర్‌లో ప్రత్యర్థి ఇంగ్లాండ్ జట్టు బలంగా పుంజుకుంది. ఆ జట్టు కొంతసేపటికే భారత్? స్కోరును సమం చేసింది. అంతేకాకుండా అదే దూకుడును ప్రదర్శించడంతో 3-2తో లీడ్?లోకి దూసుకెళ్లింది. నాలుగో క్వార్టర్‌లో భారత్‌కు కోలుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. అదే ఊపులో ఉన్న ఇంగ్లాండ్ ఇంకో గోల్ చేసి తమ ఆధిక్యాన్ని 4- 2కు పెంచుకుంది. ఇంగ్లాండ్ తరఫున స్టువర్ట్ రష్‌మెర్, హెన్రీ క్రాఫ్ట్, నికోలస్ బండూరక్ చివరి మూడు గోల్స్ సాధించారు. చివరి నిమిషాల్లో భారత్ పోరాట పటిమను ప్రదర్శించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో మ్యాచ్ 4- 2తో ముగిసింది. ఇక ఈ టోర్నీలో భారత్ తమ మూడో మ్యాచ్? పాకిస్థాన్?తో ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్ ఆగస్టు 19న ఉండనుంది. కాగా, ఈ మ్యాచ్ ఆరంభమైన తీరు చూస్తే భారత్ సరికొత్త చరిత్ర సృష్టించేలాగే కనిపించింది. ఎందుకంటే 1994 నుంచి ప్రపంచ కప్‌లో ఇంగ్లాండ్‌ను భారత్ ఓడించలేదు. ఈ మ్యాచ్?లో గెలుపు పక్కా అనుకున్నారంతా. కానీ అసలైన సమయంలో ఇంగ్లాండ్ పుంజుకోవడంతో టీమ్‌ఇండియాకు ఓటమి తప్పలేదు. అయితే పారిస్ ఒలింపిక్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో మాత్రం ఇంగ్లాండ్‌ను టీమ్‌ఇండియా ఓడించింది. ఇరుజట్లు కూడా తమ ప్రారంభ మ్యాచ్‌లలో విజయం సాధించి రెండో గేమ్?లో అడుగుపెట్టాయి. భారత్ తమ తొలి మ్యాచ్?లో వేల్స్‌ను 3-1తో ఓడించి (ఈ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ చేశాడు) ప్రపంచ కప్?లో శుభారంభం చేసింది. మరోవైపు పాకిస్థాన్‌ను 4- 1 తేడాతో ఇంగ్లాండ్ ఓడించింది. దీంతో గ్రూప్ డీలో ఇంగ్లాండ్? టాప్?లో కొనసాగుతోంది. రెండు మ్యాచ్?లు ఆడగా, రెండింట్లోనూ విజయం సాధించిన ఆ జట్టు 6 పాయింట్లతో టాప్?లో ఉంది. రెండింట ఒకదాంట్లో నెగ్గిన భారత్ (3 పాయింట్లు) రెండో ప్లేస్?లో ఉంది. ఆ తర్వాత ఒక్కో పాయింట్?తో వేల్స్, పాకిస్థాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే పట్టికలో టాప్ 2లో నిలిచిన జట్లు మాత్రమే తదుపరి దశకు చేరుకుంటాయి.

ప్రజావీక్షణం
దినపత్రిక

# చిరంజీవి పాత్రను ఎలివేట్ చేసేలా బాబీ సినిమా



మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీకి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు మెగా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. భారీ యాక్షన్ షెడ్యూల్‌లో భాగంగా కీలకమైన పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్,లక్ష్మణ్ మాస్టర్స్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఫైటర్లతో ఈ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. సినిమాలో యాక్షన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉండటంతో ఈ సన్నివేశాలను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి అభిమానులను ఆకట్టుకునేలా యాక్షన్ ఎపిసోడ్స్‌ను డిజైన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా నుంచి మరో క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న యాక్షన్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత వచ్చే వారం నుంచి స్పెషల్ సాంగ్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో చిరంజీవి పూర్తిగా స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారట. ఈ స్పెషల్ సాంగ్ కోసం మెగాస్టార్ లుక్‌ను ఇప్పటికే లాక్ చేసినట్లు సమాచారం. చిరంజీవి ఎనర్జీకి తగ్గట్టుగా పాటను డిజైన్ చేస్తున్నారని, తెరపై ఆయన స్టైలిష్ అవతార్ అభిమానులను మెస్మరైజ్ చేయడం ఖాయమని చిత్ర వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో చిరంజీవి పాత్రను దర్శకుడు బాబీ చాలా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. మెగాస్టార్ పాత్రలో పలు రకాల వేరియేషన్స్ ఉంటాయని సమాచారం. ఇప్పటివరకు చిరంజీవిని చూడని ఓ కొత్త కోణంలో ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతో బాబీ ఈ కథను సిద్ధం చేసినట్లు టాక్. అదే సమయంలో సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కూడా పెద్దపీట వేస్తున్నట్లు తెలుస్తోంది. యాక్షన్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామాతో పాటు చిరంజీవి స్టైల్, కామెడీ, మాస్ ఎలిమెంట్స్‌ను మేళవించి కథను రూపొందిస్తున్నట్లు సమాచారం.

# రాముడి సుగుణాలు కనిపించాలంటే

## రావణుడి పాత్ర బలంగా ఉండాల్సిందే: యశ్



కన్నడ స్టార్ యశ్ ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'రామాయణ' గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. రావణుడి పాత్రకి ఎందుకు ఓకే చెప్పారో వెల్లడించగా.. ఆ సమాధానం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. రాముడి మంచితనాన్ని, సుగుణాలను చూపించాలంటే రావణుడి పాత్రలో బాగా నటించాలి. నేను విలన్ పాత్రలకు న్యాయం చేయగలను. మంచి పాత్రలు చేసినా నావంతు ప్రయత్నం తప్పకుండా చేస్తాను. 'రామాయణ' కోసం మేమంతా ఇగోని పక్కన పెట్టాం. బెస్ట్ టీమ్‌తో కలిసి పనిచేస్తున్నాం. రామాయణం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసే ఉంటుంది. నేను చిన్నప్పుడు మా తాత చెబితే ఒకలాగా ఊహించుకునే వాడిని. టీవీలో, సినిమాల్లో చూసిన తర్వాత ఆ ఊహ మారింది. అందరికీ తెలిసిన కథైనప్పటికీ దాన్ని కొత్తగా చూపించగలగాలి. అలా అని మతపరమైన భావాలను దెబ్బతీయకూడదు. ఇది చాలా కష్టమైన పని. నా స్నేహితుడు నమిత్ మల్హోత్రా ఈ సినిమా కోసం బాగా రిస్క్ తీసుకుంటున్నారు. ప్రేక్షకులు దీన్ని ఆదరిస్తారని నమ్ముతున్నానని యశ్ పేర్కొన్నారు. నితీశ్ తివారి దర్శకత్వంలో ముస్తాబైన ఈ బహుభాషా చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించగా.. సీత పాత్రను సాయిపల్లవి పోషించారు. యశ్ ఇందులో రావణుడి పాత్ర పోషిస్తూనే నమిత్ మల్హోత్రాతో కలిసి నిర్మించారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' ఈ దీపావళికి విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఇటీవల ట్రైలర్‌ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇక, యశ్ మరో సినిమా 'టాక్సిక్'.. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ మూవీలో కియారా అద్వాణీ, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తున్న విశ్వనాథ్ అండ్ సన్స్




సూర్య హీరోగా నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' తెలంగాణ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా.. తొలి వీకెండ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా నైజాం ఏరియాలో ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. వీకెండ్‌లో భాగంగా ఆదివారం మూడో రోజు నైజాం ప్రాంతంలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ.5.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. దీంతో తొలి మూడు రోజుల్లో నైజాంలో ఈ సినిమా మొత్తం రూ.14 కోట్ల గ్రాస్ మార్కును అందుకుంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ స్థాయి వసూళ్లు రావడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రానికి అత్యుత్తమంగా స్పందించిన ప్రాంతంగా నైజాం నిలిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.వీకెండ్‌లో భారీ వసూళ్లు సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. సోమవారం నాటికి జీఎస్టీ మినహాయించి బ్రేక్ ఈవెన్ టా÷-గ్గ÷ట్‌ను అందుకునే అవకాశం ఉందని సమాచారం. ఇదే జోరు వర్కింగ్ డేస్‌లోనూ కొనసాగితే నైజాం డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథ, సూర్య నటన, వెంకీ అట్లూరి దర్శకత్వం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. విడుదలకు ముందు ఉన్న అంచనాలకు తగ్గట్టుగానే సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటోంది. దీంతో రోజురోజుకూ థియేటర్లలో ఆక్యుపెన్సీ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటించారు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. మొత్తానికి తొలి మూడు రోజుల్లోనే నైజాంలో రూ.14 కోట్ల గ్రాస్ సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. రాబోయే రోజుల్లో ఎలాంటి వసూళ్లను నమోదు చేస్తుందో చూడాలి.




# గోగితా చిక్వాడ్జే దర్శకత్వంలో ..వారణాసి మేకింగ్ వీడియో

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్ కాస్ట్‌తో తెరకెక్కుతున్న ఈ గ్లోబల్ అడ్వెంచర్‌పై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్‌పై ఓ ఇంట్రెస్టింగ్ విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజమౌళితో పాటు మరో దర్శకుడు కూడా 'వారణాసి' ప్రాజెక్ట్‌లో భాగమయ్యారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆయన ప్రధాన సినిమాకు దర్శకత్వం వహించడం లేదు. 'వారణాసి' ఎలా రూపుదిద్దుకుంటోంది? రాజమౌళి టీమ్ ఎలాంటి కష్టపడుతోంది? నటీనటులు ఎలాంటి వర్క్‌షాప్స్‌కు హాజరయ్యారు? భారీ సెట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ఎలా తెరకెక్కుతున్నాయి? వంటి అంశాలను చూపించే ప్రత్యేక మేకింగ్ డాక్యుమెంటరీని రూపొందించే బాధ్యతను ఆయన తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేకింగ్ డాక్యుమెంటరీ కోసం జార్జియాకు చెందిన దర్శకుడు గోగితా చిక్వాడ్జేను ఎంపిక చేసినట్లు సమాచారం. డాక్యుమెంటరీ చిత్రీకరణలో అనుభవం ఉన్న ఆయన.. 'వారణాసి' ప్రీ-ప్రొడక్షన్ దశ నుంచే తన కెమెరాలతో ఈ ప్రయాణాన్ని రికార్డ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నటీనటుల వర్క్‌షాప్స్, పాత్రల కోసం వారు చేస్తున్న ప్రత్యేక శిక్షణ, భారీ సెట్స్ నిర్మాణం, షూటింగ్ ప్రక్రియ, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ వంటి అనేక కీలక అంశాలను ఈ డాక్యుమెంటరీలో చూపించనున్నట్లు సమాచారం. సాధారణంగా సినిమా విడుదలకు ముందు లేదా షూటింగ్ చివరి దశలో మేకింగ్ వీడియోలను రూపొందిస్తుంటారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం సినిమా రూపకల్పన ప్రారంభమైనప్పటి నుంచే మేకింగ్‌ను డాక్యుమెంట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రాజమౌళి ఆలోచనా విధానం, ప్రీ-ప్రొడక్షన్‌లో ఆయన చేసే ప్లానింగ్, నటీనటుల ప్రిపరేషన్, భారీ స్థాయిలో విజువల్స్‌ను రూపొందించే విధానం వంటి విషయాలను ప్రేక్షకులు మరింత దగ్గరగా చూసే అవకాశం ఉంటుంది. రాజమౌళి సినిమాల మేకింగ్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. 'బాహుబలి' చిత్రానికి సంబంధించిన మేకింగ్ కంటెంట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే 'ఆర్‌ఆర్‌ఆర్'కు సంబంధించిన మేకింగ్ వీడియోలు, షూటింగ్ విశేషాలు కూడా సోషల్ మీడియాలో భారీగా వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో 'వారణాసి' మేకింగ్ డాక్యుమెంటరీని మరింత భారీ స్థాయిలో రూపొందిస్తు న్నట్లు తెలుస్తోంది. సినిమా వెనుక ఉన్న అసలు శ్రమను, రాజమౌళి విజన్‌ను, అంతర్జాతీయ స్థాయిలో ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్న విధానాన్ని ఇందులో చూపించనున్నట్లు సమాచారం. 'వారణాసి' కేవలం భారతీయ మార్కెట్‌ను మాత్రమే కాకుండా అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్న సినిమా కావడంతో.. మేకింగ్ డాక్యుమెంటరీకి కూడా గ్లోబల్ స్థాయిలో మంచి డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందని చిత్ర వర్గాలు భావిస్తున్నట్లు టాక్. సినిమా డిజిటల్ హక్కులతో పాటు మేకింగ్ డాక్యుమెంటరీని కూడా ప్యాకేజీలో భాగంగా చేసే ఆలోచనపై చర్చలు జరుగుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.



Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com